ఈనాడు
శ్రీకాకుళం
గురువారం 31 ఆగస్టు 2017 16 పేజీలు

'ఉత్తి'పోతలే!

- నీటి లభ్యత అనుమతుల్లోనే జాప్యం
- 'బొంతు' పథకం టెండర్లు వెనకెనక్కి
- అయోమయంలో పాతికవేల ఎకరాల ఆయకట్టు



కోటబొమ్మాళి మండలం చిన్నసాన ఎత్తిపోతల పథకం నుంచి ఇటీవల ప్రయోగాత్మకంగా నీటి విడుదల

ఈనాడు - శ్రీకాకుళం

జిల్లాలో ప్రతిపాదిత ఎత్తిపోతల పథకాలకు గ్రహణం పట్టింది. నీటి లభ్యత అనుమతుల్లోనే ఎడతెగని జాప్యం జరుగుతోంది. సుమారు పాతిక వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు రూపొందించిన ప్రతిపాదనల్లో కేవలం రెండింటికి మాత్రమే అనుమతులు లభించాయి. మిగిలిన పథకాలకు అనేక కొర్రీలు పడుతున్నాయి. ప్రతిష్ఠాత్మక బొంతు ఎత్తిపోతల పథకానికి టెండర్లు సైతం వాయిదా పడటం గమనార్హం. పొలాలకు నీరందించే సరఫరా కాలువతో సహా అంచనాలు వేసి టెండర్లు పిలవాలన్న సూచనతో ఈ నెల 31తో పిలిచిన టెండర్లను రద్దు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది.

జిల్లాలో దాదాపు భారీ ఎత్తిపోతల పథకంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రతిష్ఠాత్మకంగా మంజూరు చేయించుకున్న బొంతు - సారవకోట - కొత్తూరు ఎత్తిపోతల పథకం టెండర్ల దశలో నిలిచిపోయింది. ఈ పథకాన్ని 11,700 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ప్రతిపాదించారు. ప్రభుత్వం పాలనపరమైన అనుమతులు మంజూరు చేసింది. ఆయకట్టు రైతులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. నీటిపారుదల అభివృద్ధి సంస్థ అధికారులు సుమారుగా రూ. 180 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇతరత్రా పద్దులకు కేటాయించిన మొత్తాన్ని మినహాయించి రూ. 106 కోట్లతో కేవలం ఎత్తిపోతలకు సంబంధించిన గొట్టాలు, పంపుల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఈ నెల 31 ఆఖరు తేదీ. సరిగ్గా టెండర్ల దాఖలుకు గడువు ముంచుకొస్తున్న దశలో నీటిపారుదల సంస్థ ఆకస్మికంగా టెండర్లు నిలిపేసింది. సరఫరా కాలువల నిర్మాణానికి సంబంధించి రూ. 20 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంది. ఈ కాలువలను కూడా ప్రస్తుత టెండర్లలోనే కలపాలన్న ఉద్దేశమే టెండర్ల రద్దుకు కారణంగా ఇంజినీరింగు అధికారులు (మిగతా 15వ పేజీలో)

ఇంటర్ 'పిటీ'!

- పేరుకే 'సూపర్‌ఫాస్ట్'
- భువనేశ్వర్- విశాఖ ఇంటర్‌సిటీ రైలు తీరు



పలాస, న్యూస్‌టుడే: మనం ఓ పల్లెవెలుగు బస్సు ఎక్కాం. అది మార్గమధ్యంలోనే ఉన్న ప్రతి స్టాపు వద్ద ఆగి ప్రయాణికులను ఎక్కించుకుంటూ, దించుకుంటూ వెళ్తుంది. అదే ఎక్స్‌ప్రెస్ బస్సులో ఎక్కామనుకోండి. అన్ని స్టాపులో ఆగకుండా.. ప్రధాన స్టాపుల్లోనే ఆగుతుంది. దీని టికెట్టు ధర ఎక్కువే. దీంతో పాటు సీట్లూ సౌకర్యంగా ఉంటాయి. పల్లెవెలుగు బస్సుకే ఎక్స్‌ప్రెస్ అని బోర్డు పెట్టేసి.. అన్ని చోట్లా ఆగుతూ వెళ్తుంటే? అధిక టికెట్టు వసూలు చేస్తుంటే? ప్రయాణికులకు (మిగతా 15వ పేజీలో)

ఏదీ ధీమా..?!

- మూడేళ్లుగా బీమా పథకానికి దూరం
- ఆసరా కోల్పోతున్న పాడి రైతులు

న్యూస్‌టుడే, మెళియాపుట్టి

● మెళియాపుట్టి నడసంద్ర గ్రామానికి చెందిన రత్నాకర్ కుంటియా అనే రైతుకు చెందిన రూ. లక్షల విలువైన రెండు ఎడ్లు గతేడాది పిడుగుపాటుకు గురై ఎడ్లు మృతి చెందాయి. వాటికి బీమా లేకపోవడంతో పరిహారం పొందలేకపోయాడు. ● మెళియాపుట్టి గ్రామానికి చెందిన తిరుమలరావుకు చెందిన రూ. 70 వేల విలువ గల పాడిగేదె పది నెలల క్రితం కుక్క కాటుకు గురై మృతి చెందింది. పూర్తిగా నష్టపోయాడు. ● మెళియాపుట్టి గ్రామానికి చెందిన పట్నాన రాముకి చెందిన రూ. 40 వేల విలువ గల పాడిఆవు పాము కాటుకు మృతి చెందింది. బీమా లేకపోవడంతో నష్టపరిహారం అందలేదు.

..వీరే కాదు.. జిల్లాలోని పాడి రైతులందరి ఇదే (మిగతా 15వ పేజీలో)

మిలియన్ మార్చ్‌కు తరలిరండి

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో కంట్రిబ్యూటరీ పింఛను రద్దు కోరుతూ సెప్టెంబరు 1న విజయవాడలో నిర్వహించతలపెట్టిన మిలియన్ మార్చ్ కార్యక్రమానికి జిల్లాకు చెందిన సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగులంతా వేలాదిగా తరలిరావాలని ఎన్జీఓ సంఘ రాష్ట్ర సహా అధ్యక్షులు చౌదరి పురుషోత్తమనాయుడు, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాంలు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నది దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం. ఈ మేరకు రెండేళ్ల కిందట అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎడాపెడా మరుగుదొడ్లు నిర్మించారు. నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించేందుకు కేంద్ర బృందం సభ్యులు కూడా జిల్లావ్యాప్తంగా తనిఖీలు సైతం చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ భారం పాఠశాలలు మోయలేక కొన్నాళ్ల పాటు చేతులెత్తేశాయి. దీంతో మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదూత్‌లను నియమించింది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో స్వచ్ఛదూత్‌లకు నెలనెలా వేతనాలు చెల్లించేందుకు నియమించారు. 2016, ఫిబ్రవరిలో స్వచ్ఛదూత్‌లను నియమించి ఏప్రిల్‌తో వీరి సేవలను నిలిపివేశారు. అనంతరం మళ్లీ గతేడాది డిసెంబరులో నియమించినా.. ప్రస్తుతం వీరి సేవలు గాలిలో తేలుతున్నాయి.

–న్యూస్‌టుడే, నరసన్నపేట



స్వచ్ఛదూత్‌లు ఉన్నట్టా?... లేనట్టా?

- అయిదు నెలలుగా వేతనాలు కరవు
- విద్యార్థులతోనే పారిశుద్ధ్య పనులు
- 1 నుంచి స్వచ్ఛ విద్యాలయ ఉత్సవాలు

జిల్లాలో 3,302 పాఠశాలలుండగా, ప్రతి పాఠశాలలకు చెరో స్వచ్ఛదూత్‌ను ప్రభుత్వం నియమించింది. ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే స్వచ్ఛదూత్‌లకు నెలకు రూ.2 వేలు, ప్రాథమికోన్నత పాఠశాల స్వచ్ఛ దూత్‌లకు రూ.2,500, ఉన్నత పాఠశాలలో పనిచేసే స్వచ్ఛదూత్‌లకు రూ.4 వేలు చెల్లించేందుకు ప్రభుత్వం నియమించింది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి స్వచ్ఛదూత్‌లకు వేతనాలు సైతం చెల్లించడం లేదు. తాజాగా వీరి సేవలను నిలిపివేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఈ నెల 23వ తేదీ నుంచి స్వచ్ఛదూత్‌లను తొలగించేందుకు నిర్ణయించారు. మండలాల్లో సంబంధిత ఎంఈవోలకు మౌఖిక ఆదేశాలు సైతం జారీ అయ్యాయి. దీంతో కొన్ని మండలాల్లో ఈనెల 23వ తేదీ నుంచి స్వచ్ఛదూత్‌ల సేవలను నిలిపి వేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులే మరుగుదొడ్లు, పాఠశాలలను శుభ్రం చేసుకుంటున్నారు. ఇటీవల జరిగిన నరసన్నపేట మండల పరిషత్తు కార్యాలయ సమావేశమందిరంలో జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో స్వచ్ఛదూత్‌లను కొనసాగించవద్దని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాఠశాలల్లో పనిచేసే స్వచ్ఛదూత్‌లకు చెందిన డ్యూటీ సర్టిఫికేట్లను అందించి పంపిస్తున్నారు. సారవకోట మండలంలో కూడా వచ్చే నెల 1వ తేదీ నుంచి స్వచ్ఛదూత్‌ల సేవలుండవని విద్యాశాఖ నుంచి ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు అందాయి.

1 నుంచి స్వచ్ఛ విద్యాలయ ఉత్సవాలు...

పాఠశాలల్లో వచ్చే 1వ తేదీ నుంచి స్వచ్ఛ విద్యాలయ ఉత్సవాల నిర్వహణకు రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ సన్నద్ధం చేస్తోంది. 1న మండల స్థాయిలో ఎంపీపీ, జడ్పీటీసీసభ్యులు, ఎంపీడీవో, తహసీల్దార్ తదితర అధికారులతో అవగాహన సదస్సులు నిర్వహించాలి. 4న పాఠశాల స్థాయిలో అవగాహన సదస్సు, ప్రదర్శనలు చేపట్టాలి. 5న వనమహోత్సవం నిర్వహణ, 6న పాఠశాల ఆవరణలోని నిరుపయోగ వస్తువులు తొలగించడం, 7న పాఠశాలల అలంకరణ, విద్యార్థుల పుస్తకాలకు అట్టలు వేయడం, 8న పాఠశాల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ తదితర పోటీలు నిర్వహించాలి. 11న పాఠశాల సముదాయ స్థాయిలో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించడం, బహుమతులు ప్రదానం చేయాలి. 12న మరుగుదొడ్ల వినియోగం, చేతులు పరిశుభ్రం చేయడం, 13న మండల స్థాయిలో పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేయడం, 14న పాఠశాల స్థాయిలో ఛాయాచిత్ర ప్రదర్శన, సమావేశాలు, 15న జిల్లా స్థాయిలో వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయాలి.



పరిశుభ్రతతోనే మరుగుదొడ్ల సద్వినియోగం

స్వచ్ఛదూత్‌ల సేవలు అవసరం...

పాఠశాలల్లో పరిశుభ్రతకు స్వచ్ఛదూత్‌ల సేవలు అవసరం. విద్యాహక్కు చట్టం ప్రకారం స్వచ్ఛదూత్‌లను నియమించి ప్రస్తుతం తొలగించడం తగదు. పాఠశాల విద్యార్థులతో పారిశుద్ధ్యపనులు చేయించడం చట్ట విరుద్ధం. స్వచ్ఛదూత్‌లతో కూరగాయలు పెంచడం, పాఠశాల పరిశుభ్రత తదితర పనులు చేయిస్తున్నాం. తాజాగా స్వచ్ఛదూత్‌లను నిలిపివేయమని మౌఖిక ఆదేశాలిచ్చారు.

–బమ్మిడి శ్రీరామ్మూర్తి, యుటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు

తొలగించలేదు

స్వచ్ఛదూత్‌ల సేవలు నిలిపివేయమని ఆదేశించలేదు. అయితే వారి వేతనాలకు సంబంధించిన బడ్జెట్టు విడుదల కావాల్సి ఉంది.

–కిషోర్‌కుమార్, పీడీ, డీఆర్‌డీఏ



మరుగుదొడ్లు శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

రిజర్వేషన్.. పరేషాన్!

రైల్వేలైను లేని శ్రీకాకుళం నగరంలో ప్రజలు రిజర్వేషన్లకు సైతం ఆమదాలవలస వెళ్లి ఇబ్బంది పడకుండా 15 సంవత్సరాల క్రితం మున్సిపల్ కార్యాలయంలో రైల్వే రిజర్వేషన్ కౌంటరు ఏర్పాటు చేశారు. ఇక్కడికి నిత్యం వందల మంది వస్తుంటారు. ప్రస్తుతం ఆ కేంద్రానికి ఉన్న అన్ని దారుల గేట్లకు మున్సిపల్ శాఖ వారు రెండు నెలలుగా తాళాలు వేసేశారు. కౌంటర్‌కు వెళ్లాలంటే పిట్టగోడ ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో వృద్ధులు, వికలాంగులు, ఇతరులు అవస్థలు 'పడు'తున్నారు. ఈ కౌంటర్‌ను ఇక్కడి నుంచి తరలించేయాలన్న ఉద్దేశంతో నగరపాలక శాఖ అధికారి ఒకరు ఇలా చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

-ఈనాడు, శ్రీకాకుళం



పిట్టగోడ దిగేందుకు అవస్థలు



రిజర్వేషన్ కౌంటర్ వద్ద బారులు తీరిన ప్రయాణికులు..



రైల్వే రిజర్వేషను కౌంటరుకు వస్తున్న ఓ విద్యార్థిని

రిజర్వేషను కౌంటరు చుట్టూ పిట్టగోడ, తాళం వేసిన గేట్లు





గేటుకు తాళం

నమ్మించి మోసం

అరసవల్లి, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం నైర గ్రామానికి చెందిన అదపాక రమణ అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తి నమ్మించి మోసం చేసాడు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 28న నైర గ్రామానికి చెందిన అదపాక రమణ అనే వ్యక్తి రామలక్ష్మణ కూడలిలో ఉన్న ఓ ఏటీఎంలో సొమ్మును తీసేందుకు వెళ్ళారు. మూడుసార్లు ఏటీఎం కార్డు పెట్టినా సొమ్ములు రాకపోవడంతో వెనుక ఉన్న వ్యక్తికి కార్డు ఇచ్చి సొమ్ము తీయాలని కోరారు. ఆ వ్యక్తి కార్డును మార్చేసి నకిలీ కార్డును రమణకు ఇచ్చేశాడు. అది గమనించని రమణ అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఆ వ్యక్తి అదే రోజు రాత్రి అయిదుసార్లు కార్డును ఉపయోగించి రూ. 41 వేలు డ్రా చేసేశాడు. బుధవారం రమణ తన ఏటీఎం కార్డు పనిచేయడం లేదని వాకబు చేసేందుకు బ్యాంకుకు వెళ్ళాడు. ఆయన ఖాతాలో నుంచి రూ. 41 వేలు సొమ్ము తీశారని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎర్రంనాయుడు తెలిపారు.

చికెన్ ధరలు

బ్రాయిలర్ (బ్యాగ్) లైవ్: 97; డ్రెస్డ్: 149; స్కిన్‌లెస్: 169; **వెన్‌కాబ్:** లైవ్: 100; డ్రెస్డ్: 140; స్కిన్‌లెస్: 165, **సుగుణ:** లైవ్ 97; డ్రెస్డ్: 141; స్కిన్‌లెస్: 165.

ఇచ్ఛాపురం

మిలియన్ మార్చ్‌కు మద్దతివ్వండి

సోంపేట, న్యూస్‌టుడే: నూతన పింఛన్ విధానం(సీపీయస్) రద్దు కోరుతూ సెప్టెంబరు 1న విజయవాడలో నిర్వహించే మిలియన్ మార్చ్ కార్యక్రమానికి మేముసైతం అంటూ ఉపాధ్యాయులు బుధవారం విస్తృతంగా ప్రచారం చేశారు. సీపీయస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల యూనియన్ ఆధ్వర్యంలో కంచిలి, సోంపేట మండలాల పరిధిలో అన్ని గ్రామాలకు చెందిన పాఠశాలల్లో పర్యటించి తమకు మద్దతుగా నిలవాలని ఉపాధ్యాయులను కోరారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సోంపేట, న్యూస్‌టుడే: సెప్టెంబరు 1న విద్యుత్తు లైన్లకు మరమ్మతులు, నిర్వహణ పరమైన పనులు నిర్వహిస్తున్నందున విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ కె.లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు సోంపేట, బెంకిలి, జింకిభద్ర, కొర్లాం, మామిడిపల్లి ఫీడర్ల పరిధి గ్రామాలకు విద్యుత్తు సరఫరా ఉండదని, దీనికి వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

వన సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ



తులసిగాంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ

తులసిగాం (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: వన సంరక్షణతోనే పర్యావరణాన్ని కాపాడవచ్చునని, అది జీవకోటికి అవసరమని ఇచ్ఛాపురం ఎంపీపీ దక్కత డిల్లీరావు పేర్కొన్నారు. బుధవారం తులసిగాం పంచాయతీ పరిధిలో 320 మొక్కలు నాటారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటి, వాటికి వెదురు కంచెలను అమర్చారు. మొక్కల సంరక్షణ బాధ్యత మహిళా సంఘాలదేనని, ఇతర ప్రాంతాలకన్నా చక్కటి శ్రద్ధతో వీటిని వృద్ధి చేయాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసీ అధ్యక్షులు సాడి సహదేవురెడ్డి, గ్రామప్రతినిధులు సారధిరెడ్డి, డిల్లి, కామేష్‌లతో పాటు రాజేశ్వరి మహిళాసంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షం కురిసింది... చింత తీరింది

కవిటి, న్యూస్‌టుడే : అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాల వల్ల బీలప్రాంత పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ మెట్ట ప్రాంత రైతులకు మాత్రం జీవధార దొరికినట్లైంది. ప్రధానంగా వర్షం పైనే ఆధారపడి సాగుచేస్తున్న రాజపురం, భైరిపురం, కొజ్జిరియా, కరాపాడు, శిలగాం, బెలగాం, గొర్లెపాడు, సహలాలపుట్టుగ తదితర ప్రాంతాల మెట్ట రైతులు ఎట్టకేలకు వరినాట్లు వేశారు. విరివిగా వర్షాలు కురియడంతో రాజపురంలో బుధవారం వరినాట్లు ఉత్సాహంగా వేస్తున్నారు. దానికి అద్దం పట్టిందే ఈ చిత్రం



నాట్లు వేస్తున్న కూలీలు

కొబ్బరి పాలిట సంజీవిని

● భారీ వర్షాలతో రైతుల్లో హర్షాతిరేకాలు ● యాజమాన్య పద్ధతులపై కృషి



కొబ్బరి తోటలలో జలకళ

కవిటి, న్యూస్‌టుడే : అనుకోని అతిథిలా అల్పపీడనం కారణంగా ఇటీవల కురిసిన వర్షాలు కొబ్బరి రైతులను ఆనందంలో ముంచెత్తుతున్నాయి. గత కొంతకాలంగా సరైన వర్షాలు లేకపోవడంతో దిగాలుపడిన కొబ్బరి రైతులకు తాజా వర్షాలు మంచి ఫలితాన్ని ఇచ్చేలా కనిపిస్తున్నాయి. ప్రధానంగా రాబోయేకాలంలో చీడపీడల ఉద్ధృతి తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు, ఉద్యానశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఎర్రనల్లి, గ్యానోడెర్మా, కొమ్ముపురుగు వంటి చీడపీడల నివారణతో పాటు కాయ నాణ్యత పెరిగే అవకాశముందని రైతులు భావిస్తున్నారు.

అంతర పంటలకు మేలు

జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఉద్దానంలో సుమారు 33 వేల ఎకరాల్లో సాగవుతుండగా కవిటి, కంచిలి మండలాల పరిధిలో కొబ్బరిలో అంతర పంటలుగా జీడి, మామిడి, పనస, అరటి, మునగ, సపోట తదితర పంటలను సాగు చేస్తున్నారు. కోనసీమతో పోలిస్తే ఇక్కడి కొబ్బరికి నీటితడులు అందించే రైతుల సంఖ్య చాలా చాలా తక్కువ. ఈ నేపథ్యంలో కేవలం వర్షాధారం పైనే కొబ్బరి సాగవుతున్న పరిస్థితులలో గత కొంతకాలంగా వర్షాలు ముఖం చాటేయడంతో దాని ప్రభావం నాణ్యత, దిగుబడులు, ధరలన్నింటిపైనా పడింది. ఫలితంగా రైతుల పరిస్థితి దారుణంగా దిగజారింది. ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రంగా ఉన్న నేపథ్యంలో కష్టాల నుంచి గట్టెక్కేదెలా అని భావిస్తున్న తరుణంలో తాజా వర్షాలు కొబ్బరికి, రైతులకు ఊపిరిలూదాయి. దీంతోపాటు అంతర పంటలకు తాజా వర్షాలు వరంగా మారాయి. ముఖ్యంగా కొబ్బరి రైతుకు అదనపు ఆదాయాన్ని అందిస్తున్న అంతర పంటలకు సరైన సమయంలో కురిసిన వర్షాలు ఎంతో మేలు చేకూర్చనున్నాయి. అలాగే గత కొంతకాలంగా మెట్టు ప్రాంత రైతులకు వర్షాలు లేని కారణంగా వరి పొలాలు బీడు భూములుగా మిగిలిపోగా ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో ఉత్సాహంగా సాగులోకి దిగారు.



కొబ్బరి తోటలు

యాజమాన్య పద్ధతులపై దృష్టిపెట్టాలి



నిస్సందేహంగా తాజా వర్షాలు కొబ్బరి రైతులకు ఎంతో లాభదాయకం. అయితే రైతులు యాజమాన్య పరంగా కొన్ని చర్యలు తీసుకుంటే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రధానంగా నాలుగైదు రోజుల వ్యవధిలో చెట్టుకు కనీసం 10 కిలోల పశువుల గెత్తం లేదా సేంద్రియ ఎరువులు అందిస్తే మంచిది. గ్యానోడెర్మా ఇతర చీడపీడలు, తెగుళ్లు సోకిన చెట్లకు సిఫారసు చేసిన ముందులను అందించాలి. దీంతోపాటు పచ్చిరొట్టను కలియదున్నితే మరింత ప్రయోజనకరం.

– శంకరదాస్, ఉద్యానశాఖాధికారి

న్యాయమైన డిమాండ్ల సాధనకు ధర్నా

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత ఐదు రోజులుగా చేస్తున్న రిలే నిరసన దీక్షలపై ప్రభుత్వం స్పందించాలని, తమకు న్యాయం చేయాలని ఇచ్ఛాపురం గ్రామ రెవెన్యూ సేవకుల సంఘ అధ్యక్షులు బాడాన సింహాద్రి కోరారు. బుధవారం రిలే దీక్షలో కూర్చున్న సభ్యులను అభినందించి, దీక్షను ప్రారంభించారు. తమ వేతనాలను రూ. 18వేలకు పెంచాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, అర్హులను గ్రామరెవెన్యూ అధికారులుగా నియమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏ సంఘ సభ్యులంతా పాల్గొన్నారు.

కంచిలి, న్యూస్‌టుడే: అపరిష్కృతంగా మిగిలిన గ్రామ సహాయకుల సమస్యలు తక్షణమే పరిష్కరించి వారి ఇబ్బందులు తొలగించాలని తెదేపా నాయకులు కోరారు. కంచిలిలో ఆందోళన చేస్తున్న గ్రామసహాయకులకు తెదేపా నాయకుడు బి.కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బృందం వెళ్లి సంఘీభావం తెలియజేసింది. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, ఇతర అంశాలపై గ్రామ సహాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలకు తెదేపా నాయకులు సంఘీభావం తెలిపారు.



రిలే దీక్షలో ఇచ్ఛాపురం వీఆర్ఏలు

పరిశుభ్రతతోనే ఆరోగ్య భద్రత

రత్తకన్న (ఇచ్ఛాపురం): పరిసరాలు శుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవచ్చునని, ముఖ్యంగా ప్రతీ ఇంటా మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘం కమిషనరు పూడి రవిబాబు, శానిటరీ బాధ్యులు ఉపేంద్ర పేర్కొన్నారు. బుధవారం రత్తకన్న పరిధిలోని 18, 19, 20 వార్డులలో దోమల నిర్మూలకు ఫాగింగ్‌యంత్రాన్ని వినియోగించి, రసాయనపొగను విడిచిపెట్టారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల రవాణా అవస్థలు తీరినట్లే

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: వివిధ ప్రాంతాల నుంచి పురుషోత్తపురం ఏపీ ఆదర్శ పాఠశాలకు వచ్చే విద్యార్థుల రవాణా వెతలు తీరినట్లేనని ఆంధ్రాబ్యాంకు మాజీ డైరక్టర్, సోంపేట సీహెచ్‌సీ అధ్యక్షులు బెందాళం ప్రకాష్ అన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సుకు ఆయన పూజలు చేసి ప్రారంభించారు. విద్యార్థులు ఈ బస్సును సద్వినియోగపరచుకోవాలని, ఆర్టీసీ యాజమాన్యం కూడా విద్యార్థుల తరగతుల మేరకు వేళలు సవరిస్తూ, సేవలందించాలని ప్రకాష్ కోరారు. ఇచ్ఛాపురం ఎంపీపీ దక్కత డిల్లీరావు, ఎఎంసీ అధ్యక్షులు సహదేవురెడ్డి, ఎంఈవో కె.అప్పారావు, ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు గుజ్జు జగన్నాధరెడ్డి(జగ్గు), పాఠశాల ప్రధాన ఆచార్యులు బి.రాజశేఖర్, స్థానిక ప్రముఖులు తులసీదాస్, కొండా శంకరరెడ్డి, నందిగాం కోటి, తెలుకుల శ్రీనివాస సాహు, నందికి జాని, బల్లా రామారావు, మోహనరావు, కామేశ్వరరావు తపాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రత్యేక బస్సును ప్రారంభిస్తున్న బెందాళం ప్రకాష్

వైభవంగా వినాయక నిమజ్జనం

కవిటిగ్రామీణం : మండలంలోని పెద్దయర్రగోవిందపుట్టుగ, రాజపురం గ్రామాలలో వినాయక నిమజ్జనం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉదయం సంప్రదాయ పూజల అనంతరం విగ్రహాలను గ్రామంలో ఊరేగారు. యువకుల నృత్యాలు చేస్తూ రంగులు వెదజల్లుతూ గేయాలు పాడారు. అనంతరం సమీప చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ధర్మపురం (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: ధర్మపురం, తులసిగాం గ్రామాలలో జరిగిన వినాయక చవితి వేడుకలలో భాగంగా బుధవారం వినాయక నిమజ్జనం జరిపారు. గణపతిని ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టరుపై కొలువుతీర్చి, ఆపై వెనుక మరికొన్ని వాహనాలలో భక్తులు తరలివెళ్లారు. ఈదుపురం వద్ద బాహుదానదిలో గణపతిని నిమజ్జనం చేశారు. ఈ వేడుకలలో యువకులు, యువతులు, విద్యార్థులు, పెద్దలు, మహిళలు తరలివెళ్లడం విశేషం



వినాయక నిమజ్జనంలో యువత కేరింత

సిద్ధివినాయకుడి లడ్డు రూ.77వేలు

రుషికుద్ద (సోంపేట), న్యూస్‌టుడే: వినాయక ఉత్సవాలలో భాగంగా రుషికుద్దలో నిర్వహించిన లడ్డూ వేలం ఉత్సాహభరితంగా సాగింది. బుధవారం నిమజ్జనోత్సవంలో భాగంగా రుషికుద్దలో లడ్డూ వేలం వేయగా గ్రామానికి చెందిన సంధి కృష్ణమూర్తి (దుబాయ్) అనే వ్యక్తి రూ. 77 వేలకు దక్కించుకున్నారు. బుధవారం సోంపేట, బారువ, మామిడిపల్లి, కొర్లాం గ్రామాల్లో గణపతి నిమజ్జనోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. యువత, మహిళలు ఆటపాటలతో ఊరేగించి వినాయక నిమజ్జనోత్సవంలో ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. మండలంలో మహాగణపతి నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.



సోంపేట బనిశెట్టి వీధిలో కొలువైన గణనాథుడు

ఇచ్ఛాపురం

భూసమస్యల పరిష్కారం దిశగా పనిచేయండి

గాంధీపార్కు (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: మండలాల్లో ప్రజలు, రైతులు చెప్పే భూ సమస్యలను త్వరగా పరిశీలించి, పరిష్కారాలను చేపట్టాలని రాష్ట్ర భూపరిపాలనాశాఖ ప్రధాన కమిషనరు అనిల్‌చంద్ర పునేఠా పేర్కొన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అందరూ రెవెన్యూ అధికారులతోనూ, జిల్లా రెవెన్యూ విభాగ అధికారులతోనూ దూరదృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయా కార్యాలయాలలోని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. అన్నీ క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మండల, డివిజన్, జిల్లాస్థాయి సమీక్షలతో పురోగతిని సాధించాలని పునేఠా పేర్కొన్నారు. ఇచ్ఛాపురం మండల తహసీల్దారు కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇచ్ఛాపురం తహసీల్దారు ఎం.సురేష్ పాల్గొన్నారు.

తెరపై సినిమాలు

★ ఇచ్ఛాపురం : ఎల్‌మాక్స్ సినిమా(శ్రీమణికంఠ), వివేకం, పూర్ణ - అర్జున్‌రెడ్డి ★ సోంపేట : శ్రీనివాస - జయ జానకి నాయక, శివ - వి.ఐ.పి-2 ★ కవిటి : మహాలక్ష్మి - వివేకం, అశోక్ - నేనేరాజు... నేనేమంత్రి

–న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఉల్లాసభరితంగా 3కే రన్



త్రీకే రన్ పోటీలు ప్రారంభిస్తున్న సోంపేట ఎస్.ఐ. భాస్కరరావు

(న్యూస్‌టుడే- సోంపేట)

సోంపేట వుయ్‌ఫర్‌యూ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో 3కె రన్‌తో పాటు వివిధ క్రీడల పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. మూడు కిలోమీటర్ల పరుగుపందెంలో అధిక సంఖ్యలో యువత, విద్యార్థులు పాల్గొన్నారు. పరుగుపందెం పోటీలను సోంపేట ఎస్.ఐ.కె.భాస్కరరావు, సామాజిక ఆసుపత్రి వైద్యాధికారి ఎస్.రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన యువత పరుగుపందెంలో ఉల్లాసంగా పాల్గొన్నారు. సోంపేట నుంచి కంచిలి వైపు మూడు కిలోమీటర్ల పరుగుపందెంలో వయోభేదం లేకుండా యువత, వివిధ వర్గాల వ్యక్తులు పాల్గొన్నారు. వుయ్‌ఫర్‌యూ స్వచ్ఛందసంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఈశ్వరరావు, టి.ధర్మరాజు, డి.జోగారావు, ఇతర సభ్యులు పర్యవేక్షించారు. సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.జోగారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు తవిటయ్య, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

3కె రన్ విజేత ఇచ్ఛాపురం పవన్

3కె రన్ విజేతగా ఇచ్ఛాపురానికి చెందిన ఆర్.పవన్ నిలిచారు. కాగా కంచిలి మండలంలోని గెద్దలపాడుకి చెందిన యు.రవి ద్వితీయస్థానం, ఇచ్ఛాపురానికి చెందిన టి.కూర్మారావు తృతీయస్థానంలో నిలవగా సంతోషపురం(ఒడిశా)కు చెందిన బి.జగదీష్ ప్రోత్సాహక బహుమతి గెలుచుకున్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీలు ఉల్లాసంగా నిర్వహించారు.

క్రీడా పోటీల విజేతలు

వుయ్‌ఫర్‌యూ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. షాట్‌పుట్ సీనియర్ విభాగంలో డి.సాయి, బి.సురేష్, పి.లక్ష్మినారాయణస్వామి, జూనియర్ విభాగంలో బి.రాకేష్, ఎం.దత్తాత్రేయ, డి.బాలు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు గెల్చుకున్నారు. లాంగ్‌జంప్‌లో సీనియర్ విభాగంలో జి.కూర్మారావు, బి.సురేష్, టి.లక్ష్మినారాయణ, జూనియర్ విభాగంలో ఆర్.విజయ్‌కుమార్, జి.రాకేష్, ఆర్.శంకర్, బాలికల విభాగంలో కె.ఉమ, జె.సంతోషి, కె.మహలక్ష్మి మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నారు. హైజంప్ సీనియర్ విభాగంలో డి.పవన్, డి.అఖిల్, జి.కూర్మారావు, జూనియర్ విభాగంలో పి.సాయితేజ, జి.అనీష్, టి.కిరణ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు గెల్చుకున్నారు.



విజేతలతో వుయ్‌ఫర్‌యు సంస్థ ప్రతినిధులు

నూతన పింఛన్ విధానం రద్దు చేయాలి

సోంపేట, న్యూస్‌టుడే: నూతన పింఛన్ విధానం రద్దు చేసి పదవీవిరమణ తరువాత ఉద్యోగుల భద్రతకు భరోసా ఇచ్చే పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండు చేశారు. బుధవారం సోంపేటలో సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యులు నగిరి శరత్, మాస్టీల సాంబమూర్తి మాట్లాడుతూ సీపీయస్ పింఛన్ విధానంతో నెలకొన్న ఇబ్బందులు, ఇతర అంశాలు వివరించారు. ఈ సమావేశంలో పలువురు పీఆర్టీయూ నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దయ్యేవరకు రాజీలేని పోరాటం

సోంపేట, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానంతో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పాత పింఛన్ విధానం పునరుద్ధరించే వరకు సీపీయస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉద్యమంలో పాల్గొని రాజీలేని పోరాటం సాగిస్తామని యూటీయఫ్ జిల్లా కార్యదర్శి లండ బాబూరావు పేర్కొన్నారు. బుధవారం సోంపేటలో తెలుకుల అచ్యుత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూటీయఫ్ నాయకులు నగిరి మోహనరావు, జి.ప్రకాశరావు, ఆర్.సుశీల, జి.శ్రీనివాసరావు, ఎం.సంతోష్‌కుమార్, కె.గోపి, ఎల్.రవికుమార్, ఎస్.కూర్మారావు, వై.ధనరాజు, వెంకటేష్ మాట్లాడుతూ సీపీయస్ రద్దు కోసం తమ సంఘం రాజీలేని పోరాటం సాగిస్తుందని పేర్కొన్నారు.

చిత్తశుద్ధితో కూడిన విధులతోనే గుర్తింపు

బారువ (సోంపేట): సమాజానికి దిక్సూచి లాంటి ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించిననాడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. వాడపాలెం ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు వై.ఎం.శ్రీనివాసరావుని గ్రామస్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. జి.శివశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పి.సత్యవతి, ఎంపీటీసీ వి.అశోక్, గ్రామ ప్రతినిధి ఎస్.వి.ఎల్.ఎన్.రామకృష్ణ, కొత్తూరు ప్రధానోపాధ్యాయుడు సూర్యారావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో శ్రీనివాసరావు చేసిన కృషిని అభినందించారు.

సోంపేట, న్యూస్‌టుడే: ఖజానా శాఖ పరంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని పీఆర్టీయూ ప్రతినిధులు జిల్లా ఖజానా అధికారిని కోరారు. బుధవారం సోంపేట ఉపఖజానా వార్షిక తనిఖీ కోసం వచ్చిన జిల్లా ఖజానా అధికారిణి జి.నిర్మలను పీఆర్టీయూ అధ్యక్షుడు ముప్పన సోమేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం బాధ్యులు రమేష్‌పాణిగ్రహి సమస్యను పరిష్కరించాలని కోరారు.

బెల్లుపడ కాలనీలో ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం పట్టణంలోని బెల్లుపడ కాలనీ దళిత వీధిలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. రేకులకాలనీకి చెందిన అమ్మాయి విషయంలో వీరు తగువుపడ్డారు. జుత్తు పూండి ఆ అమ్మాయిని ఏదో అన్నారని, హరిపూండి ఘర్షణకు దిగాడు. ఈ ఘర్షణలో గెడ్డపారతో జుత్తుపూండి తలపై కొట్టడంతో తీవ్రగాయమైంది. అతన్ని ఇచ్ఛాపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి చేర్పించగా, ప్రథమచికిత్స చేశారు. ఆపై మెరుగైన వైద్యం కోసం బ్రహ్మపుర వైద్యకళాశాలకు తరలించారు. పట్టణ ఎస్సై బి.మంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా జుత్తుపూండి తనను కొట్టాడని హరిపూండి కూడా ఫిర్యాదు చేయడంతో రెండో కేసును కూడా ఎస్సై నమోదు చేశారు.

గణపతి పీఠాలలో కుంకుమార్చనలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణం, మండల పరిధిలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఇచ్ఛాపురం పట్టణం ముడియావీధిలో గణపతి ఆరాధన, లక్ష్మీగణపతి హోమం, ప్రత్యేకార్చన, పత్రిపూజలను జరిపారు. వేదపండితులు రామప్రసాద్ సిద్ధాంతి, పద్మకుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ ఈ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారంపేటలో సామూహిక కుంకుమపూజలలో 58 మంది మహిళలు పాల్గొని, సిద్ధి బుద్ధి సమేత గణపతికి అర్చన చేశారు. మండలంలోని బొడ్డకాళిలో కొలువుతీర్చిన వినాయక పీఠం వద్ద టి.బరంపురం గ్రామానికి చెందిన పాండురంగ భజనమండలి చిన్నారి కళాకారులు ఆటపాటలతో అందరినీ అలరించారు.

కవిటి: వినాయక చవితి పూజలను మండలంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలకేంద్రం కవిటితో పాటు వివిధ గ్రామాలలో ఏర్పాటుచేసిన విగ్రహాల వద్ద రోజంతా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సన్యాసిపుట్టుగలో బుధవారం కుంకుమపూజలు చేశారు. గ్రామాల విగ్రహాలను మేళతాళాలతో ఊరేగిస్తూ కవిటి తీరంలో నిమజ్జనం చేశారు.



ఇచ్ఛాపురం మంగళవారంపేటలో సామూహిక కుంకుమ పూజలు

నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

సోంపేట, న్యూస్‌టుడే: వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేస్తే నవరత్నాలు అమలుచేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపుతారని, వైకాపాను గెలిపించేందుకు సహకరించాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. బుధవారం వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు జోగారావు ఆధ్వర్యంలో సోంపేట, బారువ, కొర్లాం, బేసిరామచంద్రపురం, పాలవలస, మాకన్నపురం, పొత్రఖండ, కర్తలిపాలెం, సుంకిడిలో పర్యటించి ఈనెల 31న ఆర్.బెలగాం కాలనీలో జరిగే పార్టీ సర్వసభ్య సమావేశానికి అంతా హాజరుకావాలన్నారు.

ప్రస్తుత వాతావరణం.. తెగుళ్ల విజృంభణకు అనుకూలం



తేలుకుంచిలో పొలంపిలిచింది నిర్వహిస్తున్న ఏవో నర్సింహమూర్తి

తేలుకుంచి (ఇచ్ఛాపురం), న్యూస్‌టుడే: ప్రస్తుత వాతావరణం తెగుళ్ల విజృంభనకు అవకాశాలను పెంచుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహమూర్తి పేర్కొన్నారు. బుధవారం తేలుకుంచి గ్రామంలో పొలం పిలిచింది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రైతులకు విలువైన సూచనలు చేశారు. చిరుజల్లు నుంచి సాధారణ వర్షం కురియడం, ఆపై ఎండకాయడం, వరిదుబ్బు చేసే దశ చివరలో ఉండటం, ఎరువులు జల్లిన పొలాలు, నీరు తగ్గుతున్న కొద్దీ ఎరువులు వాడే రైతుల పరిస్థితి. ఇవన్నీ అగ్గితెగులు, పొడ తెగులు, ఆకుముడత తెగులు, చీడపీడల వ్యాప్తికి అనుకూలమన్నారు. తేలుకుంచి పొలాల్లో అగ్గితెగులును గుర్తించి, వాటి నివారణకు వాడాల్సిన మందులను వివరించారు. పొలంగట్లపై పెరిగిపోయిన గడ్డిని తొలగించాలని సూచించారు. అభ్యుదయ రైతులు మేరుగు నారాయణ, హరికృష్ణ, దుర్యోధన పాల్గొన్నారు.

వరస పద్ధతిలో నాట్లు వేసుకుంటే మేలు

పలాసపురం (సోంపేట), న్యూస్‌టుడే: వరస పద్ధతిలో నాట్లు వేయడం ద్వారా మొక్కల మొదళ్ల వరకు గాలి, వెలుతురు సోకి చీడపీడలు నివారించొచ్చని మండల వ్యవసాయాధికారిణి ప్రియాశ్రీదేవి సూచించారు. బుధవారం పలాసపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక పద్ధతులలో వరినాట్లు వేసిన సంక గోపి పంట పొలాన్ని పరిశీలించి సూచనలు చేశారు. గ్రామసభలో ఏవో మాట్లాడుతూ పొలంలో జిగురు ఎరలు ఏర్పాటుచేసుకోవడంతో రసం పీల్చుపురుగులు నివారించొచ్చని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు, ఇతర పోషకాలను ఉపయోగించాలన్నారు. ఎంపీఈవో సాయికుమార్, సీఆర్పీ లక్ష్మణరావు, సీఏ కుమారి, రైతు ప్రతినిధులు బెందాళం బాబూరావు, బెందాళం అశోక్, గోపి పాల్గొన్నారు.

వైద్యశాఖలో ఖాళీల భర్తీకి కౌన్సెలింగ్



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ, వైద్యాధికారులు

కలెక్టరేట్ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు బుధవారం సంయుక్త కలెక్టర్-2 పి.రజనీకాంతరావు అధ్యక్షతన కౌన్సెలింగ్ నిర్వహించారు. వైద్యులు, ఏఎన్ఎంలు, ఫార్మాసిస్టులకు సంబంధించిన ఖాళీలను భర్తీ చేశారు. మైదాన ప్రాంతంలోని 5 పీహెచ్‌సిలలో ఇద్దరు వైద్యులు, 14 మంది స్టాఫ్ నర్సులు, 4 ల్యాబ్ టెక్నీషియన్‌లు, 5 ఫార్మాసిస్టులు, ఐటీడీఏ పరిధిలో 39 ఏఎన్ఎంలు, 9 ఫార్మాసిస్టులు, నలుగురు పీజీ వైద్యులు, 14 స్టాఫ్ నర్సులకు కౌన్సెలింగ్ జరిగింది. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. ఎస్.తిరుపతిరావు, డీసీహెచ్ఎస్ సూర్యారావు, డా. ధవళ భాస్కరరావు, డా. ఎం.ప్రవీణ్, డా. జగన్నాథరావు, డీఎంహెచ్‌వో కార్యాలయ పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, పాల్గొన్నారు.

బక్రికొండపై తవ్వకాలు, పేలుళ్లు నిర్వహిస్తే కఠిన చర్యలు



బక్రికొండ వద్ద దస్త్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, సర్వేయర్

ఈనాడు కథనానికి స్పందన

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని డకరవలస గ్రామానికి సమీపంలో బూర్జ మండలానికి చెందిన సుందరయ్యపేట రెవెన్యూ పరిధిలో బక్రికొండపై అక్రమ తవ్వకాలు, రాళ్ల పేల్చడం చేస్తే సంబంధిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు సరుబుజ్జిలి, బూర్జ మండలాల తహసీల్దార్లు జేమ్స్ ప్రభాకర్, ఎస్.కిరణ్‌కుమార్‌లు తెలిపారు. 'కొండపై పంజా' అనే శీర్షికతో 'ఈనాడు'లో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించిన సరుబుజ్జిలి, బూర్జ మండలాల రెవెన్యూ అధికారులు కొండను తనిఖీ చేశారు. బక్రికొండపై సర్వే నంబరు 1లో జరుగుతున్న తవ్వకాల భూమిని పరిశీలించారు. స్థలాన్ని పరిశీలించిన తరవాత తవ్వకాలు, రాళ్ల పేలుళ్లు జరగడం వాస్తవమేనని అంగీకరించారు. కొండ వద్దకు అధికారులు వచ్చినట్లు తెలుసుకున్న బూర్జ మండలం కొరగాం పంచాయతీ సర్పంచి బెవర జానకి ప్రతినిధి అయిన బెవర గోవిందరావు కొండ వద్దకు వచ్చారు. దీంతో తవ్వకాల కోసం పంచాయతీ తరపున అనుమతులు ఇచ్చారా అని అధికారులు ప్రశ్నిస్తే రహదారి పక్కన తవ్వకాలు చేసేందుకు పంచాయతీ అనుమతి ఇవ్వలేదని ఆయన తెలిపారు. అయితే ఇక నుంచి తవ్వకాలు చేయకుండా సర్పంచి బాధ్యత వహించాలని అధికారులు సూచించారు. కొండ వద్ద నిల్వ ఉన్న రాళ్లను తరలించినా, తవ్వకాలు చేసినా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేయించడంతో పాటు పట్టుబడిన ట్రాక్టర్‌లను సీజ్ చేయిస్తామని స్థానికులు, సర్పంచి ప్రతినిధిని వారు హెచ్చరించారు. కొండ వద్ద ఎటువంటి తవ్వకాలు చేసినా సరుబుజ్జిలి పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని వీఆర్ఏ రామరాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సూర్యనారాయణ, వీఆర్వోలు ధర్మారావు, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు వాస్తవం.. అన్నింటిని తొలగిస్తాం

- స్థానిక వీఆర్‌వోనే ఆక్రమించినట్లు అధికారుల అంచనా
- 'ఈనాడు' కథనంపై కొనసాగుతున్న విచారణ



ఆక్రమణలను క్షేత్రస్థాయిలో గుర్తిస్తున్న రెవెన్యూ అధికారులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: భావితరాల భవిష్యత్తు దృష్ట్యా సుప్రీంకోర్టు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రభుత్వ చెరువులు ఆక్రమణలను గురకాకూడదని వీటిని స్థానిక రెవెన్యూ అధికారులు పరిరక్షించాలని అనేక సార్లు మార్గదర్శకాలు ఇస్తున్నా అవి క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరించటం లేదు. క్షేత్రస్థాయిలో పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులే ఆక్రమణకు పాల్పడుతూ ఆక్రమణదార్లకు అండగా నిలుస్తున్నారు. మండలంలోని అజ్జరాం గ్రామంలో ప్రభుత్వ చెరువులు, బందలు ఆక్రమించుకోవటంపై ఈనెల 28న 'ఈనాడు'లో 'జల' వనరుల్లో జలగలు అనే కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన యంత్రాంగం గత మూడు రోజుల నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువులు, బందలు ఆక్రమణకు గురికావడం వాస్తవమని గుర్తించారు. మొత్తం పది చెరువులు, బందలు పరిశీలించగా కొన్ని పూర్తిగా, కొన్ని సగానికి పైగా ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. బుధవారం ఆర్ఐ వైకుంఠరావు, సర్వేయర్ రవిలు దస్త్రాలతో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను మండల రెవెన్యూ అధికారులకు అందించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరిబాబు మాట్లాడుతూ పది చెరువుల్లో 12.5 ఎకరాల మేర ఆక్రమణ జరిగిందన్నారు. ఈ ఆక్రమణ వ్యవహారంలో స్థానిక వీఆర్వో దారపు అసిరినాయుడు పాత్ర ఉన్నట్లు క్షేత్రస్థాయిలో గుర్తించారు. దీనిపై జిల్లా అధికారులకు తెలియజేసి నీరు-చెట్టు కార్యక్రమంలో పనులు చేసుకొనేలా ఆక్రమణలు తొలగించి అప్పగిస్తామన్నారు. ఆక్రమించిన రైతుల్లో బోర ధర్మారావు, దారపు సూరోడు, దారపు రాముడు, జీరు అసిరినాయుడు, బోర అప్పారావు, బోర బలరాం, దారపు శంకర రెడ్డి, బోర జనార్ధనరావు, దారపు అసిరినాయుడు(వీఆర్‌వో), దారపు అప్పారావు, దారపు సూర్యారావు తదితరులు ఉన్నారని ఆయన తెలియజేశారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

బలగ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో గత మూడు రోజులుగా నిర్వహించిన పీఈటీలు, పీడీల సెమినార్ బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పీఈటీల పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. వ్యాయామ విద్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 1న విజయవాడలో నిర్వహించనున్న మిలియన్ మార్చ్ విజయవంతానికి అంతా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీలు, పీడీల సంఘం ప్రతినిధులు ఎంవీ రమణ, పోలినాయుడు, గరుగుబెల్లి రాజశేఖర్, ఎన్వీ రమణ, ఎం.ఎస్.శేఖర్, రాజారావు, సుందరరావుతో పాటు ఉపాధ్యాయ ప్రతినిధులు భైరి అప్పారావు, హరిశ్చంద్రుడు, పప్పల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు

మైనారిటీ ఉపకార వేతనాల దరఖాస్తుకు తుది గడువుల ఖరారు

పాత శ్రీకాకుళం, న్యూస్‌టుడే: జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ద్వారా మైనారిటీ వర్గాలైన ముస్లింలు, క్రైస్తవులు తదితర మతాలకు చెందిన విద్యార్థులకు ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్, మెరిట్ కమ్ మీన్స్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు గడువులను ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించిందని జిల్లా మైనారిటీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు మహమ్మద్ షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఉపకార వేతనాల తాజా దరఖాస్తులను వచ్చేనెల 30 లోగా, ఇప్పటికే అందుకుంటున్న వారు నవీకరణను ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో జరుపుకోవాలని సూచించారు. ముందుతరగతి మార్కుల జాబితా, బ్యాంకు పాసుపుస్తకం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ ధ్రువపత్రం, మత ధ్రువీకరణ పత్రం, పాఠశాల / కళాశాల ఫీజు రసీదు, నివాస ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, విద్యార్థి మొబైల్ నెంబరు తదితర వివరాలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08922-230250 నెంబరులో సంప్రదించాలని కోరారు.

రైతు కన్నీరు కార్చడం బాధాకరం

ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు




మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: రైతులు లేకపోతే దేశ ప్రజలకు తిండి ఉండదని, సమాజాన్ని ఉద్ధరించే రైతులు వ్యవసాయంలో నష్టాలు వల్ల కన్నీరు కార్చడం బాధాకరమని ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శ్రీకాకుళం గ్రామీణ మండలం నైర వ్యవసాయ కళాశాలలో సంకల్ప సే సిద్ధి (సంకల్పంతో సాకారం) కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ దేశంలో రైతులు అధిక లాభాలు సాధించడం ద్వారా రారాజుగా చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ప్రతి రైతు ముఖంలో సంతోషం చూడాలన్నదే ప్రధాన నరేంద్ర మోదీ లక్ష్యమని అన్నారు. అందులో భాగంగా రైతులకు సంబంధించి సంకల్ప సే సిద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం 99 పథకాలు అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ప్రస్తుతం పంటల బీమా, పంట రుణాలు, రాయితీపై విత్తనాల సరఫరా వంటి 21 రకాల పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉభయగోదావరి జిల్లాలకు దీటుగా రైతులు వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులను తీర్చి దిద్దాలన్నారు. గ్రామాల్లో సాగునీటి వనరుల అభివృద్ధిలో భాగస్వామ్యం వహించి నీటి వనరులను సక్రమంగా సద్వినియోగించుకోవాలన్నారు. సాగునీటి అభివృద్ధికి నాబార్డు రూ. 20 వేల కోట్లు కేటాయించిందని, దీంతో పోలవరం ప్రాజెక్టు సైతం పూర్తి చేసుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. వ్యవసాయంపై అంతా శ్రద్ధ వహించాలని, రైతుల సమస్యలు, మద్దతు ధర వంటి విషయాలు పార్లమెంటులో తన వంతుగా చర్చిస్తానన్నారు. నైర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. కె.అంకయ్య మాట్లాడుతూ వ్యవసాయ కళాశాలలో విద్యార్థులు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా శిక్షణ ఇస్తామన్నారు. కళాశాలలో రూ. 2 కోట్లతో దివంగత కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు పేరుతో స్టేడియం నిర్మాణానికి ఎంపీ రామ్మోహన్‌నాయుడు నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు మాట్లాడుతూ తమకు గిట్టుబాటు ధర రావటం లేదని చెప్పారు. వ్యవసాయ శాఖ సంచాలకులు జి.రామారావు, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ఎం.వెంకటేశ్వర్లు, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఇ.ప్రమీల, మత్స్యశాఖ ఉపసంచాలకులు వి.వి.కృష్ణమూర్తి, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు వై.శ్యాంకుమార్, ఉద్యావన శాఖ సహాయ సంచాలకులు ఎం.ఎ.జమదగ్ని మాట్లాడుతూ ఆయా శాఖల ద్వారా రైతుల కోసం అమలు చేస్తున్న పథకాలను, ప్రగతిని వివరించారు. సంకల్పంతోనే సాకారం కరపత్రాన్ని, ఉద్యానవన పంటల ఛార్టును ఎంపీ తదితరులు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల బోర్డు సభ్యులు చాపర గణపతిరావు, శ్రీకాకుళం ఎంపీపీ గొండు జగన్నాథరావు, ఆమదాలవలస మున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.గీత, సంకల్ప సే సిద్ధి పర్యవేక్షకులు డి.చిన్నంనాయుడు, శాస్త్రజ్ఞులు, రైతులు పాల్గొన్నారు.


జెమ్స్ ఆసుపత్రిలో 12 పారామెడికల్ కోర్సులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జెమ్స్ ఆసుపత్రి క్యాంపస్‌లో బొల్లినేని మెడిస్కిల్స్ పారామెడికల్ ఇనిస్టిట్యూషన్‌లో 12 పారామెడికల్ కోర్సుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినట్లు ఆ కేంద్రం ప్రతినిధి సి.హెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబరు 5వ తేదీ లోగా ఆసుపత్రిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.























- ప్రతి విద్యార్థినికి ఒక మొక్క పెంపకం బాధ్యత
- అటవీశాఖ వెబ్‌సైట్లో నమోదుకు చర్యలు



పొందూరు కేజీబీవీలో దత్తత తీసుకొని మొక్కలను పెంచిన విద్యార్థినులు

కేజీబీవీలు.. హరితాలయాలు

పొందూరు, న్యూస్‌టుడే

మొక్కలు పెంచి పచ్చదనం పరిఢవిల్లేలా చేస్తే ప్రకృతి సమాజానికి సన్నిహితమవుతుందనడంలో సందేహం లేదు. పరిసరాల్లో కనిపించే పచ్చదనం మదిని దోచేస్తుంది.. ఆ అందం, ఆనందమే వేరు.. ఒక్క మాటలో చెప్పాలంటే చెట్టు అవనికి రక్షణ బొట్టు.. అందుకే చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకొనే పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండాలని హరిత పొదరిల్లులా తీర్చిదిద్దుతున్నారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజం స్థాపించవచ్చు. పచ్చదనం, పరిశుభ్రత, ప్రజారోగ్యం, స్వచ్ఛతే లక్ష్యంగా పాఠ్యాంశాలు విద్యార్థులను మంచి మార్గం వైపు నడిపిస్తున్నాయి. భవిష్యత్తు కోసం, కాలుష్యం లేని సమాజం కోసం మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు. జిల్లాలోని 32 కేజీబీవీల్లో ఈ నెల 24న పెద్ద ఎత్తున అధికారులు 3,400 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి విద్యార్థినికి ఒక మొక్క చొప్పున సంరక్షించే బాధ్యతను అప్పగించే కార్యక్రమం ఇది. ఈచ్ వన్.. ప్లాంట్ వన్ కార్యక్రమంగా జిల్లాలో అన్ని కేజీబీవీల్లో హరిత విప్లవం చేపట్టారు.

ప్రతి విద్యాలయంలో కనీసం 220 మొక్కల పెంపకం లక్ష్యం

జిల్లాలో ప్రతి కేజీబీవీలో కనీసం 220 మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ఏడాది ఆగస్టు నెలలో ప్రతి విద్యాలయంలో దాదాపు 150 నుంచి 180 మొక్కలను నాటారు. ఈ ఏడాది మిగిలిన లక్ష్యాన్ని చేరేందుకు ఈ నెల 24న పెద్ద ఎత్తున మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. కేజీబీవీలను ఒక ఉద్యానవనంలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నీడ నిచ్చే, ఫలాలను అందించే మొక్కల పెంపకం చేపడుతున్నారు. ఇప్పటికే గత ఏడాది వేసిన మొక్కలు పెరిగి పెద్దవి కావడంతో లక్ష్యం సిద్ధించింది. అదే స్ఫూర్తితో మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లా అధికారులు ముందుకు సాగుతున్నారు.

విద్యార్థినులకు మొక్కల బాధ్యత.. కేజీబీవీలో చదివే ప్రతి విద్యార్థినికి ఒక మొక్కను సంరక్షించే బాధ్యతను అప్పగించారు. ప్రతి రోజు కేటాయించిన మొక్క చుట్టూ పిచ్చి మొక్కలు పెరగకుండా చూడటం, నీరు పోయడం, ఏపుగా పెరిగేందుకు అవసరమైతే కొమ్మలు కత్తిరించడం విద్యార్థినియే చేయాలి. ఉదయం, సాయంత్రం కొంత సమయం దీనికి కేటాయిస్తారు.

గ్రీన్ ట్యాగింగ్ కోడ్.. ప్రతి విద్యార్థినికి గ్రీన్ ట్యాగింగ్ కోడ్ ఇస్తారు. ప్రతి విద్యార్థిని సంరక్షించే మొక్కలకు విద్యార్థిని పేరుతో ట్యాగ్‌ను వేస్తారు. దీంతో వారు ఆ మొక్కలను సంరక్షించుకుంటారు.

పుట్టిన రోజుల సందర్భంగా.. వన మహోత్సవం సందర్భంగానే కాకుండా జిల్లాలో అన్ని కేజీబీవీల్లో విద్యార్థినుల పుట్టిన రోజుల సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆమెకు కేటాయించిన మొక్కతో పాటు పుట్టిన రోజున నాటిన మొక్కను సైతం పెంచాల్సిన బాధ్యత ఉంది. అలానే సిబ్బంది ఎంత మంది ఉంటే అంత మందికి మొక్కలను సంరక్షించేందుకు దత్తత ఇస్తారు.

అటవీశాఖ వెబ్‌సైట్లో.. కేజీబీవీల్లో పెంచే మొక్కలను అటవీశాఖ వెబ్ సైట్లో పెంటేందుకు రాజీవ్ విద్యామిషన్ అధికారులు నిర్ణయించారు. ప్రతి మొక్కను చక్కగా సంరక్షించడంతో పాటు వాటిని ఈ వెబ్‌సైట్లో సెప్టెంబరు 15 నాటికి పొందుపరచాలని నిర్ణయించారు.

జిల్లాలో కొన్ని కేజీబీవీల్లో ఇలా.. బూర్జ కేజీబీవీలో రెండేళ్లలో 280 మొక్కలను సంరక్షిస్తున్నారు. లావేరు విద్యాలయంలో సుమారు 200 మొక్కలు, జలుమూరు విద్యాలయంలో సుమారు 200 మొక్కలు, కొత్తూరు విద్యాలయంలో 290 మొక్కలు, జి.సిగడాం విద్యాలయంలో సుమారు 250 మొక్కలు, పొందూరు కేజీబీవీలో దాదాపు 500 మొక్కలను పెంచుతున్నారు.

ప్రతి ఒక్కరికి మొక్కల సంరక్షణ బాధ్యత అప్పగించాం

కేజీబీవీల్లో ఈచ్ ఒన్.. ప్లాంట్ ఒన్ కార్యక్రమం కింద మొక్కలను సంరక్షించేందుకు కార్యాచరణ చేపట్టాం. గత ఏడాది ప్రతి కేజీబీవీలో పెద్ద ఎత్తున మొక్కలను నాటారు. అలానే ఈ ఏడాది కూడా ఈ నెల 24న మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టాం. ప్రతి విద్యార్థినికి, ఉద్యోగికి మొక్కలను సంరక్షించాల్సిన గురుతర బాధ్యతను అప్పగించాం. ఇది ప్రతి కేజీబీవీలో తప్పనిసరిగా అమలు చేయాల్సిందే. పూర్తిగా కేజీబీవీలు పచ్చదనంతో పరవశించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతున్నాం.

–ఎస్.త్రినాథరావు, పీవో, ఆర్‌వీఎం, శ్రీకాకుళం



కేజీబీవీలో పెంచిన మొక్కలు

న్యూస్‌టుడే-పాలకొండ గ్రామీణం, పాలకొండ

దేశ రక్షణకు నేడు యువత నడుం బిగిస్తున్నారు. దేశ సైనిక రంగంలో పనిచేసేందుకు యువతరంలో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఇందుకోసం అహరహరం శ్రమిస్తున్నారు. భారత సైన్యంలో చేరాలంటే అందుకు ఎంతో కఠోర సాధన అవసరం. ఇందుకోసం నిపుణుల పర్యవేక్షణలో సాధన అవసరం. ఇలా సాధన చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పనే. దీంతో గ్రామీణ ప్రాంత యువత ఎటువంటి శిక్షణ పొందకుండానే సైనిక ఎంపికల్లో పాల్గొంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించింది. ఇది యువతకు ప్రయోజనకరంగా మారింది.



దేశ రక్షణకు సై!

- సెట్‌శ్రీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ
- డివిజన్ కేంద్రాల్లో ఎంపికలు
- యువతకు ఎంతో ప్రయోజనం



నెల రోజుల పాటు ఉచిత శిక్షణ

యువజన సర్వీసులు శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణా కాలంలో సైన్యంలో ఎంపికయ్యేందుకు కావాల్సిన అన్నీ శరీర దారుఢ్య పరీక్షలను నేర్పుతారు. నిపుణుల పర్యవేక్షణలో జిల్లాకు చెందిన యువతకు నేర్పిస్తూ నిరంతరం సాధన చేయిస్తారు. ఈ ఉచిత శిక్షణలో భాగంగా భోజన, వసతి సదుపాయం కల్పించనున్నారు.

ఎంపికలు ఎక్కడెక్కడంటే..

భారత సైన్యంలో ఎంపికయ్యేందుకు ఎంపిక పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌలభ్యం కోసం నెల రోజుల పాటు ఇవ్వనున్న ఉచిత శిక్షణకు డివిజన్ల వారీగా ఎంపికలు నిర్వహిస్తున్నారు.

- పాలకొండ డివిజన్‌కు సంబంధించి బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎంపికలు నిర్వహించారు. 300 మంది అభ్యర్థులు ఎంపికకు హాజరయ్యారు.
- శ్రీకాకుళం డివిజన్‌కు సంబంధించి గురువారం కోడి రామ్మూర్తి క్రీడా మైదానంలో ఎంపికలు నిర్వహించనున్నారు.
- టెక్కలి డివిజన్‌కు సంబంధించి పలాస-కాశీబుగ్గలో ఉన్న పోలీస్ మైదానంలో సెప్టెంబరు ఒకటిన ఎంపికలు నిర్వహిస్తారు.

ఇవి అవసరం..

- ఈ ఎంపికలకు 17 సంవత్సరాల ఆరు నెలల నుంచి 23 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు మాత్రమే హాజరుకావాలి.
- పదో తరగతి, ఆధార్ ధ్రువపత్రాల నకళ్లు
- రెండు ఛాయాచిత్రాలు(ఫోటోలు)

ఎంపికలు ఇలా..

- ఈ ఎంపికలకు వచ్చేవారికి స్థానిక రక్షకభటుల సాయంతో శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు.
- సైనిక రంగంలో ప్రవేశించాలనుకుంటున్న యువత ఛాతి 77 సెం.మీ. నుంచి 82 సెం.మీ. మధ్యన ఉండాలి.
- ఎత్తు 167 సెం.మీ., బరువు 50 కిలోలు ఉండాలి.
- శారీరక ఆరోగ్యంతో పాటు శారీరక దారుఢ్యం ఉన్న యువత ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవచ్చు.
- నెల రోజుల పాటు ఉచిత శిక్షణకు ఎంపికైన సమాచారం నేరుగా అభ్యర్థుల చరవాణిలకు అందిస్తారు.



గ్రామీణ ప్రాంత యువతకు ప్రయోజనం



భారత సైన్యంలో చేరాలన్నది నా కల. ఇందుకోసం మా గ్రామంలో స్నేహితులమంతా కలిసి సాధన చేస్తున్నాం. అయినా పూర్తిస్థాయిలో అవగాహన లేదు. దీంతో ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇస్తుందని తెలిసి ఎంపిక పరీక్షకు వచ్చా. ఇది గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ప్రయోజనం.

–కె.సోమశేఖర్, రేగిడి

శిక్షణను సద్వినియోగం చేసుకుంటా..

ప్రైవేటుగా శిక్షణ పొందాలంటే రూ.వేలల్లో ఖర్చుతో కూడుకున్న పని. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారమంతా శిక్షణ తీసుకోలేకపోతున్నాం. ఉచిత శిక్షణకు ఎంపికవుతానన్న నమ్మకం ఉంది. దాన్ని సద్వినియోగం చేసుకుంటాను.

–కె.ఉమామహేశ్వరరావు, రణస్థలం





ఈ మారు సైన్యంలో చేరుతా

భారత సైన్యంలో చేరాలన్నది నా అభిమతం. ఇందుకోసం ఇప్పటికే ఓ మారు ఆర్మీ ర్యాలీకి హాజరయ్యాను. పూర్తి స్థాయి అవగాహన లేక ఎంపిక కాలేకపోయాను. జిల్లా కేంద్రంలో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిసి ఎంపిక పరీక్షకు వచ్చా.

–ఎం.సన్యాసిరావు, బుడుమూరు

మంచి అవకాశం

గ్రామీణ ప్రాంతాల్లో సాధన చేసేందుకు అనువైన ప్రదేశాలు లేవు. ఇలా నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం మాకు ప్రయోజనం కలిగిస్తుంది. ఆర్మీ ర్యాలీలో పాల్గొని రాణించేందుకు ఈ శిక్షణ మంచి అవకాశం. –కె.జగదీశ్, ఆడవరం



600 మందికి అవకాశం: మూడు డివిజన్ల పరిధిలో 600 మంది వరకు ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తాం. ఎంపికల కోసం వచ్చేందుకు యువత ఉత్సాహం కనబరుస్తున్నారు. అందరికీ అందుబాటులో ఉండాలన్న కారణంగా డివిజన్ల వారీగా ఎంపికలు నిర్వహిస్తున్నాం. విజయనగరంలో ఆర్మీ ఉద్యోగ ర్యాలీ ఉంటుంది. –బీవీ ప్రసాదరావు, సెట్‌శ్రీ సీఈవో



- ఈపీడీసీఎల్ వినూత్న ప్రయోగం
- జిల్లాలో ఏడు లక్షల విద్యుత్తు కనెక్షన్లు
- స్మార్ట్ మీటర్లతో విద్యుత్తు రీఛార్జి

గీత దాటారా.. తెరపై ప్రత్యక్షం!

న్యూస్‌టుడే–గుజరాతీపేట(శ్రీకాకుళం)

తూర్పు ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) వినూత్న ప్రయోగాలు చేస్తోంది. స్మార్ట్ మీటర్ ప్రవేశపెట్టి దాని ద్వారా వినియోదారుడు ఇంటికి ఉండే విద్యుత్తు లోడ్‌ను యథావిధిగా ఉపయోగించుకుంటున్నారా? లేదా విద్యుత్తు సంస్థ కళ్లు కప్పి అదనపు లోడ్ వినియోగిస్తున్నారా అనే విషయం తెలుసుకోవడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం రూపొందించారు. విశాఖపట్నంలో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్న ఈ విధానాన్ని సెప్టెంబరు రెండో వారం నాటికి జిల్లాలో అమలు చేయాలని భావిస్తున్నారు.

● **కొత్త సాఫ్ట్‌వేర్ తయారీ:** ఈపీడీసీఎల్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశపెడుతున్న ఫైబర్ నెట్ సేవలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఉన్న అన్ని విద్యుత్తు సబ్‌స్టేషన్లలో వీటికి సంబంధించిన యూనిట్లు నెలకొల్పారు. త్వరలో విద్యుత్తు మీటరు ఉన్న ప్రతి ఇంటికి విద్యుత్తు స్తంభంపై నుంచి నేరుగా కేబుల్ అమర్చి దాని ద్వారా టి.వి. ప్రసారం, టెలిఫోన్, ఇంటర్నెట్ వినియోగించుకునే అవకాశం కల్పించడానికి అవసరమైన కార్యచరణ చేపడతున్నారు. దీనిలో భాగంగానే కొత్తగా రూపొందించిన సాఫ్ట్‌వేర్ (విద్యుత్తు లోడ్ సామర్థ్యం, వినియోగం) అమర్చనున్నారు. దీనికి స్మార్ట్ మీటర్ అనుసంధానం చేసి వినియోగదారులు వాస్తవిక విద్యుత్తు లోడ్ వినియోగిస్తున్నారా, లేదా అనేది పరిశీలిస్తారు. ఇదే విషయాన్ని గృహ యజమాని, కుటుంబ సభ్యులు ఇంట్లో వినియోగించే టి.వి. తెరపై కనిపించేలా చేస్తారు

● **లోడ్ అంటే:** విద్యుత్తు కనెక్షన్‌కు దరఖాస్తు చేసినప్పుడు ఇంట్లో ఉండే విద్యుత్తు వినియోగం ఆధారంగా ఒక కిలో వాట్, రెండు కిలోవాట్‌లు ఇలా పేర్కొనాలి. దీన్ని పరిశీలించిన విద్యుత్తు ఏఈ ఒక కిలోవాట్ సామర్థ్యం వినియోగించే వారికి కాంట్రాక్ట్ లోడ్ అండ్ సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.1,400 చెల్లించాలి. ఈవిధంగా ఎన్ని కిలోవాట్ల లోడ్ అవసరమో అన్ని రూ.1,400 గుణించి ఆ మొత్తాన్ని ఈపీడీసీఎల్‌కి చెల్లిస్తే విద్యుత్తు సౌకర్యం కల్పిస్తారు.

● **జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు:** ఈపీడీసీఎల్ విజిలెన్స్ విభాగం జిల్లాలో నిర్వహించే తనిఖీల్లో విద్యుత్తు అదనపు లోడ్ వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. కొత్త విధానం అందుబాటులోకి వచ్చాక ఇటు వినియోగదారునికి, అటు ఈపీడీసీఎల్ అధికారులకు కచ్చితంగా ఎవరు ఎంత లోడ్ వినియోగిస్తున్నారు అనే విషయం స్పష్టం అవుతుంది. భవిష్యత్తులో విద్యుత్తు చౌర్యానికి పాల్పడే అవకాశాలు సన్నగిల్లుతాయన్నది వాస్తవం.

● **విద్యుత్తు రీఛార్జీ విధానం:** ఈపీడీసీఎల్ మరో ప్రయోగం విద్యుత్తు మీటర్‌లో రీఛార్జింగ్ విధానం. మన చరవాణి పనిచేసే విధంగా కొత్త మీటరును అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ఆధారంగా వినియోగదారుడు తన ఇంటికి ఎన్ని యూనిట్ల విద్యుత్తు అవసరమో గుర్తించి ఈపీడీసీఎల్ వద్ద రీఛార్జి చేసుకుంటే సరిపోతుంది. ఉదాహరణకు ఒక ఇంటికి నెలకు రూ.500 విద్యుత్తు బిల్లు వస్తుందని భావించేవారు ఆ మొత్తానికే ఛార్జింగ్ చేసుకోవచ్చు. ఇంట్లో వినియోగం ఎక్కువ అయితే విద్యుత్తు మీటరులో చరవాణి మాదిరిగా పరిశీలించుకొని మిగతా యూనిట్లకు బిల్లు రీఛార్జి చేసుకునే విధానం అందుబాటులోకి వచ్చింది.

● **ఫైబర్ నెట్ పనులు పూర్తి :** జిల్లాలో ఫైబర్ గ్రిడ్ నెట్‌వర్కింగ్ పనులు పూర్తి చేశాం. త్వరలో జిల్లా అంతటా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

–వజ్జ కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

● **త్వరలో ప్రవేశపెడతాం :** విద్యుత్తు సంస్థ స్మార్ట్‌మీటర్ల వినియోగాన్ని మొదటి దశ కింద నగరాల్లో ప్రవేశపెట్టింది. శ్రీకాకుళం జిల్లాలో త్వరలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీనికి తోడు ముందుగా జిల్లాలో ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇవ్వాల్సిన అవసరం ఉంది. దీనికి సంబంధించిన ప్రత్యేక విభాగం ఆ పనుల్లో నిమగ్నమై ఉన్నారు.

–దత్తి సత్యనారాయణ, సూపరింటెండింగ్ ఇంజినీర్, ఈపీడీసీఎల్



శ్రీకాకుళం సబ్‌స్టేషన్‌లో ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధం చేసిన జంక్షన్ బాక్స్



ఫైబర్ నెట్ సేవలు సమన్వయం చేసేందుకు ఏర్పాటు చేసిన యూనిట్

న్యూస్‌టుడే, అరసవల్లి

జాతీయ రహదారిపై సర్రున వెళ్ళే వాహనాలు.. రోడ్డుపై పెద్ద ప్రమాదం సంభవించింది.. రక్తపు మడుగులో పడి ఉన్న ఓ వ్యకి సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు.. అటుగా చాలా మంది వెళ్తున్నా సరే ఎవరూ పట్టించుకోవడం లేదు.. ఎక్కడ మనం పోలీసులకు విషయం చెబితే కోర్టులకు వెళ్లాలో అనే భయం ప్రతి ఒక్కరి మదిలో నాటుకుపోయింది. వీటన్నింటినీ తోసిపుచ్చేందుకు జిల్లా పోలీసు శాఖ కాల్ అంబులెన్స్ అనే మొబైల్ యాప్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రంలో ప్రప్రథమంగా ఈ జిల్లాలోనే అమలవుతోంది. మీ స్మార్టు ఫోన్‌లో కాల్ అంబులెన్స్ యాప్ డౌన్ లోడ్ చేసుకొని దాని ద్వారా సమాచారం పంపితే క్షణాల్లో మీ వద్దకు అంబులెన్స్ వస్తుంది. అంబులెన్స్ కంటే ముందు అతి సమీపంలో ఉన్న ప్రథమ చికిత్స శిక్షణ పొందిన వ్యక్తులు సంఘటనా స్థలానికి చేరుకుంటారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలంలో ఉన్న వ్యక్తులు ఎవరైనా సరే ఈ కాల్ అంబులెన్స్ యాప్‌ను వాడి ప్రమాదంలో ఉన్న వ్యక్తిని కాపాడవచ్చు. సమాచారం ఇచ్చే వారిపై ఎటువంటి ఫిర్యాదులను పోలీసులు నమోదు చేయరు, ఒత్తిడి ఉండదు.



- కాల్ అంబులెన్స్ మొబైల్ యాప్ వాడుకలోకి
- సంఘటన స్థలానికే వైద్యుడి రాక
- రక్తం కోసం సంక్షిప్త సందేశం
- అమలులోకి తీసుకువచ్చిన పోలీసు శాఖ

వివరాలు చెప్పిన వ్యక్తిపై కేసులు ఉండవు



ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలంలో ఉన్న వ్యక్తులు ఎవరైనా వివరాలను అందిస్తే ఒకరి ప్రాణాలను కాపాడినవారవుతారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేయం. వారిపై పోలీసుల ఒత్తిడి ఉండదు. ప్రథమ చికిత్స అందించిన వారిపై కూడా కేసులు పెట్టం. కాల్ అంబులెన్స్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని దాని ద్వారా అత్యవసర సేవలు పొందవచ్చు. ప్రథమ చికిత్స శిక్షణను అందరూ తీసుకోండి. ప్రమాదంలో ఉన్న వ్యక్తులను కాపాడండి. –త్రివిక్రమవర్మ, జిల్లా ఎస్పీ



ఆపదలో అండగా..

✦ మీ ఆండ్రాయిడ్ ఫోన్‌లో గుగూల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి కాల్ అంబులెన్స్ అని టైప్ చేసి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రమాదం చూసినట్లయితే సంఘటనా స్థలం నుంచే ఈ యాప్‌లో ఎరుపు బటన్ నొక్కితే సమీపంలో ఉన్న అంబులెన్స్‌తో పాటు ప్రథమ చికిత్స పొందిన వ్యక్తులు సంఘటనా స్థలానికి చేరుకుంటారు. వెంటనే ప్రమాదానికి గురైన వ్యక్తికి ప్రథమ చికిత్స అందిస్తారు. మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తారు. ఇదంతా కేవలం క్షణాల్లోనే నిర్వహిస్తారు.

✦ ఈ యాప్ ద్వారా అన్ని రకాల అంబులెన్స్‌లు అంటే ఆసుపత్రుల, 108, ప్రైవేట్, జాతీయ రహదారి అంబులెన్స్‌లు 24 గంటలూ అందుబాటులో ఉంటాయి. ఈ యాప్ ద్వారా 108కు ఫోన్ చేస్తే మీ పేరుతో పాటు మీ మొబైల్ నంబరు, జీపీఎస్ స్థలం 108 సిబ్బందికి తెలుస్తోంది. వెంటనే దగ్గరలో ఉన్న 108 అంబులెన్స్ డ్రైవర్‌కు అంతర్జాలం ద్వారా ఆయన ఫోన్‌కు సమాచారాన్ని అందిస్తారు. జీపీఎస్ సిస్టం ద్వారా డ్రైవర్ మీ చిరునామాను గుర్తించి సకాలంలో చేరుకుంటారు. ప్రమాదం వివరాలు ఈ యాప్ ద్వారా తెలియజేయాలంటే మీ ఫోన్‌కు అంతర్జాలం అవసరం లేదు. మీరు ప్రమాద వివరాలు తెలియజేసేందుకు జీపీఎస్ వ్యవస్థ ఆన్ చేసి ఉంటే చాలు. ఎరుపు బటన్ నొక్కిన వెంటనే మీరిచ్చే వివరాలు సమీపంలో ఉన్న ప్రథమ చికిత్స పొందిన వ్యక్తికి, సమీపంలో ఉన్న అంబులెన్స్ డ్రైవర్‌కు, మీరు ఎంచుకున్న ఆసుపత్రికి, మీ కుటుంబ సభ్యులకు సమాచారం క్షణాల్లో చేరుతుంది.

✦ కాల్ అంబులెన్స్ మొబైల్ యాప్ ద్వారా సులభంగా రక్తదాతలను గుర్తించవచ్చు. యాప్ డౌన్‌లోడ్ చేసేటప్పుడు మన రక్త గ్రూపు వివరాలు పొందుపరచాలి. ఈ వివరాలు మన ఫోన్‌లో ఉన్న ఇతరుల ఫోన్ నంబర్లకు అనుసంధానం చేస్తారు. అయితే వారి ఫోన్‌లో కాల్ అంబులెన్స్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసి ఉండాలి. దీని ద్వారా సులభంగా రక్తదాతలను ఏదైనా అత్యవసర సమయాల్లో అంబులెన్స్ మొబైల్ యాప్‌ను వినియోగించుకోవచ్చు. ఈ యాప్ సహాయంతో మీ వైద్య దస్త్రాలను వైద్యునికి చేరవేయవచ్చు.

✦ **ఈ కాల్ అంబులెన్స్ మొబైల్ యాప్ మొత్తం ఆరు భాషల్లో ఉంటుంది. ఆంగ్లం, హిందీ, తెలుగు, ఉర్దూ, కన్నడ, తమిళంలో డౌన్‌లోడ్ చేసుకొని వాడుకోవచ్చు. ఈ యాప్‌లో శ్రీకాకుళం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, రక్తనిధి కేంద్రాలు, అంబులెన్స్ వివరాలు పొందుపరిచి ఉన్నాయి.**

✦ కాల్ అంబులెన్స్, రెడ్‌క్రాస్ సంస్థ ఇప్పటివరకు 900 మంది విద్యార్థులు, ఉద్యోగులకు ప్రథమ చికిత్స శిక్షణను ఇచ్చారు. ప్రతి కుటుంబంలో ఓ వ్యక్తికి ఈ శిక్షణను ఇవ్వాలని కాల్ అంబులెన్స్ సంస్థ నడుం భిగించింది. ఈ దిశగా చర్యలు చేపట్టింది. పోలీసు, ఆర్టీఓ, రెడ్‌క్రాస్, వైద్య, ఆరోగ్యశాఖలు సహకారాన్ని అందిస్తున్నాయి. ముఖ్యంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీటీసీలు పర్యవేక్షణ చేస్తున్నారు. జిల్లాలో నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారి సంఖ్యను తగ్గించడానికి వీరు కృషి చేస్తున్నారు. జిల్లాలోని పరిశ్రమలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలు సహకరిస్తే ఆయా కంపెనీల ఉద్యోగులకు, విద్యార్థులకు కాల్ అంబులెన్స్ సంస్థ ప్రతినిధులు ప్రథమ చికిత్స శిక్షణను అందిస్తారు. ఈ దిశగా కంపెనీలు, పరిశ్రమలు, విద్యా సంస్థల యాజమాన్యాలు కాల్ అంబులెన్స్ సంస్థ ప్రతినిధులకు అవకాశాన్ని కల్పిస్తే ప్రమాదాల మరణాలను తగ్గించవచ్చును.



విద్యార్థులకు కాల్ అంబులెన్స్ వివరాలు వివరిస్తున్న ప్రతినిధి భవానీప్రసాద్

✦ **మీకు ఆండ్రాయిడ్ ఫోన్ లేకపోతే 9392100108 అనే నంబరుకు ఫోన్ చేసి మీ పేరు, చిరునామా చెబితే సమీపంలో ఉన్న అంబులెన్స్‌కు మీ ప్రమాద వివరాలు అందజేస్తారు.**

రంగుల బండి... భలే ఉందండి



తూర్పుకోస్తా రైల్వే ఆమదాలవలస రైలు నిలయానికి బుధవారం ఓ రంగులబండి రావటంతో జనం దాన్ని ఆసక్తిగా తిలకించారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ప్రత్యేకంగా తయారుచేసిన ఎన్‌ఎంజీ పార్శిల్ గూడ్స్ రైలు స్టేషన్‌కు చేరుకోవటంతో అందులో ఏముందోనని అంతా దగ్గరకువెళ్లి పరిశీలించారు. ఇంజిన్ నుంచి గార్డు పెట్టె వరకు రంగులతో అలంకరించి ఉండటంతో ఆసక్తిగా చూశారు. ఇలాంటి రైళ్లను ఎన్‌ఎంజీ రైళ్లుగా పిలుస్తారని ఇందులో ఒక్కో బోగీలో 8 కార్లు ఉంటాయని ఈ రైలు ద్వారా అవి గమ్యానికి చేరుతుంటాయని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పలాస, ఆమదాలవలస పట్టణం

Junior Inter STUDY PLAN

Zoology

Generally, the aim of a student joined in Intermediate Bi. P. group is to secure a seat in a reputed Medical College to study M.B.,B.S. or other allied Medical Course. To get a seat in M.B.,B.S. one has to face the National Eligibility Entrance Test (NEET) and secure a good rank. Hence, while preparing for Intermediate Public Examination (IPE), critical, analytical and planned study is required.

ప్రతిభ

Tips to tap good score...

In IPE, the Zoology Paper is for 60 marks. Out of the 60 marks, 20 marks are allocated for Very Short Answer Questions [VSAQ : 10 questions × 2 marks], 24 marks are allotted for Short Answer Questions [SAQ : 6 questions × 4 marks] and 16 marks for Long Answer Questions [LAQ : 2 questions × 8 marks]. The syllabus of Zoology is divided into 8 Units. Weightage (approximate) of Marks for each unit is given below:

S. No.	Unit	Marks Allocated
I	Diversity of Living World	06
II	Structural Organisation in Animals	10
III	Animal Diversity - I (Nonchordates)	06
IV	Animal Diversity - II (Chordates)	06
V	Locomotion and Reproduction in Protozoans	08
VI	Biology in Human Welfare	14
VII	*Periplaneta americana* (Type Study)	12
VIII	Ecology and Environment	14

- As there is no choice for VSAQ, all questions should be answered. To answer these questions, all topics are to be understood clearly, read thoroughly and remember the subject matter. Answer for these questions must be direct and brief. For example...

  Q. A person is suffering from bowel irregularity and abdominal pain. His stools contains blood and mucus. Based on these symptoms, name the disease and the causative organism.

  Ans. a. Disease : Intestinal amoebiasis / Amoebic dysentery.

  b. Causative organism: *Entamoeba histolytica*

- Eight SAQ will be given. One has to answer any six in 15-20 lines each. Some questions are related to drawing the diagram and labelling also. Answer for some SAQ may not be in 20 lines and for some, it may be more than 20 lines. Hence, do not count the number of lines. Write the perfect and complete answer. If diagram is asked, draw it with a sharply pointed pencil and label the parts towards right side. If space is not sufficient, write on left side also. Generally diagrams are asked from the units II and VII.
- Regarding LAQ, three questions will be given. You have to answer any two which are familiar to you. Each answer should be in 45-60 lines. Illustrations are also necessary for these questions. This type of questions are selected from the units II, VI, VII and VIII.

Important...

- *Generally for IPE, the questions for public examination are selected from the list of questions given at the end of each unit of BIE / Telugu Akademi Text Book.*
- *While preparing a unit, first read LAQ. They cover some SAQ and VSAQ.*
- *Then read remaining SAQ. They cover some VSAQ. Then read the remaining VSAQ.*



Writer:
K. Sreeramulu
Subject Expert

Syllabus and Questions

I. Zoology - Diversity of Living World

- Generally a two marks question will be given from this unit from branches of Zoology, species, nomenclature etc.
- Four marks question is generally given from basic concepts of classification, species concept and biodiversity.

II. Structural Organisation in animals

- From the topics symmetry-types, body cavity-types two and four marks questions are common. From animal tissues, two and four marks, diagram related questions and sometimes eight marks question may be asked.

III. Animal Diversity - I


- This unit is related to the characters and classification of non-chordates. Two and four marks questions are asked from this unit.
- To study the characters, classification; characters of different classes and examples - one has to prepare tables with the help of your text book. Hence, it becomes easy to remember the features and examples.

IV. Animal Diversity - II


- From this unit two and four marks questions are asked from the characters, classification and examples of chordates.
- As in unit III, prepare tables with the help of your text book. So that it becomes easy to remember the things.

V. Locomotion and reproduction in protozoans

- Generally two and four marks questions will be given from this unit.
- Prepare tables regarding locomotory organelles and examples of protozoans and study them.
- Study the mechanisms of locomotion.
- Practice the diagrams of *Euglena* and *Paramoecium*.
- Read the transverse and longitudinal binary fission and definition of conjugation.



Euglena




Paramoecium

VI. Biology in Human welfare


- As more marks are allocated to this unit, concentrate much on this unit.
- Study the types of parasites, hosts, effects of parasites on their hosts thoroughly.
- Keep special attention on structure, life history and pathogenecity of *Entamoeba histolytica, Plasmodium, Ascaris* and *Wuchereria*.
- Also study the symptoms, causative organism and control of typhoid, Pneumonia, common cold and ring worm disease besides TDA abuse.
- All the three types of questions will be given in this unit.

VII. *Periplaneta americana* (Cockroach)

- This unit contains structure, locomotion and body systems of cockroach.
- From the body systems eight marks question may be asked.
- Practice all diagrams thoroughly for a four marks question.
- As this unit is also allocated by more marks, much attention is needed.



Salivary glands of Cockroach



Mouth parts of Cockroach

VIII. Ecology and Environment

- Like units VI and VII, for this unit also more marks are allotted. At the same time, quantity of subject matter is also more.
- As all the topics are related the activities going on around us, understanding these topics is very easy and interesting also.
- Different definitions, abiotic factors in ecosystem and their effects on organisms; population interactions, adaptations, food chains, food web, energy flow, nutrient cycles, pollution etc. need special attention.
- All the three types of questions will be given in this unit.
- While reading concentrate your mind on the Lesson. Victory is yours.

Remember...

- ✓ You have to read more and more. To acquire good knowledge on particular topics you have to read more. Make note of points of what you read. Because it's all about Latin and Greek terms and terminologies in Zoology.
- ✓ Get the latest edition of Zoology Text Book Published by the Telugu Akademi / Board of Intermediate Education for reference and thorough study of the topics.
- ✓ You have to practice a much. Write the answers again and again. It seems laborious and old fashioned but one advantage through practice is you can improve your writing skills and your writing speed increases.
- ✓ An important aspect in Zoology is diagrams. Diagrams are the key factors during your exam preparation. If you study a topic straight, you might not understand it, but with diagram, the same concept can understood well. And during exams, one method which would more appropriate is, draw the diagram first, you can explain the concept easily referring to the diagram, chances of missing the points will be less.
- ✓ Develop patience. Every concept cannot be easily understood. If any concept is taking more time, leave it and begin with easy one. It will build your confidence and you can take on the earlier concept with ease.
- ✓ Start preparing as early as possible. Do not wait till the end. Opening the book at the last moment makes you panic and results in great disappointment.

Send your feedback to
pratibhadesk@eenadu.net

For Tenth, Intermediate Study material please visit...
www.eenadupratibha.net

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు

సంస్కరణలకు పూర్వం భారతదేశంలో వృద్ధిరేటు అల్పంగా, అసంతృప్తికరంగా ఉండేది. దీనికి కారణం ప్రభుత్వరంగ సంస్థల అసమర్థత, ప్రయివేటు రంగంపై నియంత్రణలు, విదేశీ మూలధనం, విదేశీ పెట్టుబడులపై ఉన్న ఆంక్షలు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో 1991 ప్రారంభంలో భారతదేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. 1980 దశకంలో భారత ప్రభుత్వం అమలు చేసిన సురక్షితంకాని స్థూల ఆర్థిక విధానాలే ఆర్థిక అసమతౌల్యానికి దారితీశాయి. 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 5.1 శాతంగా ఉన్న కోశలోటు 1990-91 నాటికి 7.8 శాతానికి చేరుకుంది. ఈ లోటు సర్దుబాటు కోసం ప్రభుత్వం దేశీయ రుణ సమీకరణ చేసింది. 1980-81 లో ఈ రుణం స్థూల దేశీయోత్పత్తిలో 30 శాతం కాగా, 1990-91 నాటికి 50 శాతానికి చేరింది. ఇంతేకాకుండా విదేశీ వ్యాపార చెల్లింపుల శేషపు కరెంట్ ఖాతా లోటు 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 1.39 శాతం లేదా 2 బిలియన్ డాలర్లు కాగా, 1990-91 నాటికి 3.9 శాతం లేదా 9.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ విపత్కర పరిణామాల కారణంగా భారత ప్రభుత్వ విదేశీ రుణం 1980-81 లో జీడీపీలో 12 శాతం ఉండగా, 1990-91 నాటికి 23 శాతానికి చేరింది. విదేశీ మారక నిధులు కేవలం ఒక వారానికి సరిపడే దిగుమతుల స్థాయికి పడిపోయాయి. ద్రవ్యోల్బణం 1980-81 లో 6.7 శాతం నమోదు కాగా 1990-91 నాటికి 10 శాతానికి చేరుకుంది. దీనికి తోడు 1990 ఆఖరి దశకంలో ఏర్పడిన గల్ఫ్ సంక్షోభం పెట్రోలు ధరల పెరుగుదలకు కారణమై ఆర్థిక సంక్షోభాన్ని మరింత తీవ్ర స్థాయికి చేర్చింది.

ఆర్థిక సంక్షోభాన్ని నివారించి అంతర్గత, బహిర్గత నమ్మకపు స్థాయిని నిలబెట్టుకోవడానికి అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ చొరవతో 1991 లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. అందుకే వీటిని 'రావు-మన్మోహన్ నమూనా' అని కూడా పిలుస్తారు. ఈ సంస్కరణల ఫలితంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చెప్పుకోదగ్గ స్థాయిలో విధానపరమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం ప్రపంచస్థాయిలో దేశం శీఘ్రతర ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (LPG) విధానాన్ని అమలు చేసింది.

ఆర్థిక సంస్కరణల లక్ష్యాలు

ఎ) కోశ లోటును, రెవెన్యూ లోటును తగ్గించడం.
బి) ప్రభుత్వరంగ పరిధిని తగ్గించి, ప్రయివేటు రంగానికి అప్పగించడం.
సి) పారిశ్రామిక లైసెన్సులు ఎత్తివేయడం.
డి) విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం, విదేశీ వ్యాపారంలో సుంకాలు, కోటాలు ఎత్తివేయడం.
ఇ) ఆర్థిక వృద్ధిరేటును పెంచడం.
ఎఫ్) సంపూర్ణ ఉద్యోగితను సాధించడానికి ఉపాధిని విస్తరించడం.
జి) పేద, ధనిక వర్గాల మధ్య వ్యత్యాసాలు తగ్గించడం.
హెచ్) దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభాను తగ్గించడం.
ఐ) ప్రాంతీయ అసమానతలు తగ్గించడం.

సంస్కరణల్లోని ముఖ్యాంశాలు

1980 వ దశకం మధ్యలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం విదేశీ వర్తకం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, విదేశీ మూలధనంపై ఆంక్షలను సడలించడానికి ప్రయత్నించినప్పటికీ, పూర్తిస్థాయి సంస్కరణలు మాత్రం 1991 లోనే జరిగాయి. ఈ నూతన ఆర్థిక సంస్కరణలను రెండు విధాలుగా చెప్పవచ్చు. 1) స్వల్పకాలానికి సంబంధించిన స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు, 2) దీర్ఘకాలానికి సంబంధించిన నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు.

స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు

ఆర్థిక వ్యవస్థలో వెంటనే సర్దుబాటు చేసేందుకు ఉపయోగించిన ఈ చర్యలనే డిమాండ్ నిర్వహణ చర్యలు అంటారు. దీనిలో భాగంగా ద్రవ్య సప్లయ్‌ని తగ్గించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, కోశ సర్దుబాటు చర్యల్లో భాగంగా రాబడిని పెంచి, వ్యయాలను తగ్గించడం, విదేశీ చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు మూల్యహీనీకరణ లాంటి చర్యలను సూచించారు.

వీటిలో ప్రధానంగా పన్ను రాబడిని పెంచేందుకు 1991, 1998 లలో రాజా చెల్లయ్య కమిటీని, ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించేందుకు 2000 లో గీతాకృష్ణన్ కమిషన్‌ను నియమించారు. ఇవేకాకుండా పన్నేతర రాబడిని పెంచేందుకు నీటిపారుదల, విద్యుత్, రోడ్లు మొదలైన వాటిపై యూజర్ చార్జీలు విధించారు. కోశలోటును తగ్గించేందుకు భారత ప్రభుత్వం 2003 లో 'కోశ సంస్కరణల బడ్జెటరీ నిర్వహణ చట్టాన్ని' (FRBM) ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాలు రెవెన్యూ లోటును 2008–09 నాటికి 0 శాతానికి, కోశలోటును 3 శాతానికి తగ్గించగలగాలి. ఈవిధంగా తగ్గించిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుంది. విదేశీ వ్యాపార చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు 1991 జులై 1, 3 తేదీల్లో రెండు సార్లు మూల్యహీనీకరణ (18% నుంచి 19% మేరకు) చేశారు.

భారతదేశంలోని ఆర్థిక సంస్కరణలను మూడు ప్రతిపాదనలకు సంబంధించిన అంశంగా పరిగణించాలి. అవి: ప్రయివేటీకరణ, సరళీకృత విధానాల అమలు, ప్రపంచీకరణ. ప్రయివేటీకరణ - ప్రభుత్వరంగ సంస్థలు, విధులను ప్రయివేటు రంగపరం చేయడాన్ని తెలుపుతుంది. సరళీకృత విధానాలు - ప్రభుత్వ ఆంక్షలు, నియంత్రణలను సడలించి పారిశ్రామిక, ద్రవ్య, విత్త, విదేశీ విధానం, విదేశీ పెట్టుబడుల్లో ఉదార వైఖరిని పాటించడాన్ని వివరిస్తాయి. ప్రపంచీకరణ - మూలధనం, సాంకేతిక విజ్ఞానం, వస్తుసేవలు, శ్రామిక గమనశీలతపై ఆంక్షలను తొలగించి స్వేచ్ఛా విధానం ద్వారా 'విశ్వ గ్రామానికి' మార్గం సుగమం చేయడాన్ని సూచిస్తుంది.

ప్రతిభ

ప్రపంచీకరణ అంటే ఏమిటి...?

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు

ఇవి దీర్ఘ కాలానికి చెందినవి. సప్లయ్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినవి. దీనిలో భాగంగానే భారత ప్రభుత్వం సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ అనే మూడు విధానాలను ప్రవేశ పెట్టడానికి కృషిచేసింది.

సరళీకరణ (Liberalisation)

ప్రభుత్వం నియంత్రిత, కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థకు స్వేచ్ఛను కల్పించడాన్ని 'సరళీకరణ' అంటారు. అంటే ప్రభుత్వ జోక్యం తగ్గించి, మార్కెట్ శక్తులకు స్వేచ్ఛను కల్పించడం. లైసెన్సులు, పెట్టుబడి లాంటి విషయాల్లో సరళీకరణ వైపు మొగ్గుచూపారు. సంస్కరణలకు పూర్వం ఏ పరిశ్రమ స్థాపించాలన్నా ప్రభుత్వం నుంచి లైసెన్సులు పొందాల్సి వచ్చేది. కానీ, 1991 ఆర్థిక సంస్కరణల్లో భాగంగా, సరళీకరణ విధానం ద్వారా 18 రకాల పరిశ్రమలు మినహా మిగతా వాటికి లైసెన్సులు ఎత్తివేశారు. ప్రస్తుతం వీటి సంఖ్యను ఆల్కహాలు, సిగరెట్లు, ప్రమాదకర రసాయనాలు, రక్షణ పరికరాలు, పారిశ్రామిక పేలుడు పదార్థాల్లాంటి 5 పరిశ్రమలకు పరిమితం చేశారు.

విదేశీ పెట్టుబడులపై పరిమితిని సవరించారు. 49 శాతం అనే పరిమితిని ఎత్తివేశారు. చాలా పరిశ్రమల్లో 74 శాతం వరకు, కొన్ని గుర్తించిన పరిశ్రమల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. గనులు, పోర్టులు, టూరిజం, తేయాకు, కాఫీ, రబ్బరు లాంటి తోట పంటలు, కొరియర్ సేవలు లాంటి వాటిలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించారు.

ఏకస్వామ్యాల నియంత్రణ చట్టం (MRTP) పరిశ్రమల స్థాపన, విస్తరణకు అవరోధంగా మారిందని గుర్తించి సరళీకరణలో భాగంగా దీన్ని సవరించారు. మౌలిక రంగాలను ప్రభుత్వ రంగానికి పరిమితం చేసి, ఇతర పరిశ్రమల్లో ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించారు. పారిశ్రామిక తీర్మానాల్లో పరిశ్రమలను అత్యంత ప్రభావితం చేసిన వాటిలో 1991, జులై 24 న ప్రవేశపెట్టిన తీర్మానం ప్రధానమైంది. ప్రపంచీకరణ భావాలు దీనిపై ప్రభావం చూపాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడానికి విధానాలను సరళతరం చేశారు. 1991 నుంచి విదేశీ మారక నియంత్రణ చట్టాన్ని (FERA) సడలిస్తూ, విదేశాల్లో భారతీయులు జరిపే లావాదేవీల విషయంలో స్వేచ్ఛను పెంచారు. చివరకు FERA ను 1999 లో విదేశీ మారక నిర్వహణ చట్టం (FEMA) గా మార్చారు. FEMA ను 2000 జూన్ 1 నుంచి అమల్లోకి తెచ్చారు.

ప్రయివేటీకరణ (Privatisation)

గత రెండున్నర దశాబ్దాలుగా ఎంతో ప్రాచుర్యం పొందిన పదం ప్రయివేటీకరణ. దీనికి అర్థం ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే కార్యకలాపాల నుంచి ప్రభుత్వం వైదొలగి, మార్కెట్ వ్యవస్థను పటిష్టం చేయడం. పబ్లిక్ సంస్థల యాజమాన్యం, నిర్వహణ భారాన్ని ప్రయివేటుపరం చేసే ప్రయివేటీకరణ ప్రక్రియను 1969 లో ఆచార్య పీటర్ డ్రకర్ తన 'The Age of Discontinuity' లో ప్రస్తావించారు. 1980 లో మార్గరెట్ థాచర్ ఇంగ్లండ్‌లో పబ్లిక్ రంగ సంస్థలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియ చేపట్టడంతో ఈ భావన ప్రాచుర్యంలోకి వచ్చింది.

1980 లలో మన దేశంలో కొన్ని రంగాల్లో ప్రయివేటీకరణ ప్రవేశ పెట్టినప్పటికీ ఆశించిన ఫలితాలనివ్వలేదు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలు, దేశంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా 1991 లో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానం ప్రయివేటీకరణ ప్రక్రియకు పెద్దపీట వేసింది. పబ్లిక్‌రంగ సంస్థల యాజమాన్యం, ఆస్తులు ప్రయివేటుపరం చేయడం వల్ల సంస్థ యాజమాన్య సామర్థ్యం మెరుగుపడి, ఆర్థిక సమర్థత పెరుగుతుందన్న వాదం బలపడింది.

ప్రయివేటీకరణ ప్రక్రియను మన దేశంలో Disinvestment, ఇంగ్లండ్‌లో Denationalisation, ఆస్ట్రేలియాలో Prioritisations, బొలీవియాలో Industrial transition, బ్రెజిల్‌లో Destatisations, న్యూజిలాండ్‌లో Assets Sales Programme అనే భావనల ద్వారా అమలుచేస్తున్నారు.



రచయిత
సీహెచ్. వెంకట్ రెడ్డి
అసిస్టెంట్ ప్రొఫెసర్

1991 లో ప్రయివేటీకరణలో భాగంగా ప్రభుత్వానికి కేటాయించిన పరిశ్రమలను ప్రయివేటు రంగానికి అప్పగించారు. తద్వారా ప్రభుత్వ రంగానికి కేటాయించిన పరిశ్రమలను 8 కి తగ్గించారు. ప్రస్తుతం ఈ పరిశ్రమల సంఖ్యను 2 కి తగ్గించారు. అణుశక్తి, రైల్వే రవాణా మినహా మిగతా అన్ని పరిశ్రమలను ప్రయివేటు రంగంలో స్థాపించుకోవచ్చు.

ప్రయివేటీకరణలో భాగంగానే ప్రభుత్వరంగ సంస్థల్లోని పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని రూపొందించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రభుత్వానికి ఉన్న వాటాలను ప్రజలకు, సంస్థలకు, మ్యూచువల్ ఫండ్స్‌కు అమ్మివేయడాన్ని 'పెట్టుబడుల ఉపసంహరణ' (Disinvestment) అంటారు. వ్యూహాత్మకంకాని ప్రభుత్వరంగ సంస్థల్లో భారీగా పేరుకుపోయిన ప్రభుత్వ వనరులను సాంఘిక రంగం వైపు మళ్లించడం, మితిమీరుతున్న ప్రభుత్వ రుణ భారాన్ని తగ్గించే లక్ష్యంతో పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని ప్రవేశపెట్టారు. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చిన నిధులను 75 శాతం సాంఘిక సేవలపై, మిగిలిన 25 శాతం లాభాలు వచ్చే ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు పెడతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ప్రభుత్వం అనుసరించే సరైన పెట్టుబడుల ఉపసంహరణ వ్యూహాన్ని సూచించమని ప్రొఫెసర్ రంగరాజన్ అధ్యక్షతన 1992 లో కమిటీని నియమించారు. అదేవిధంగా దీర్ఘకాలంలో ఉత్తమమైన పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని సూచించేందుకు జి.వి.రామకృష్ణ అధ్యక్షతన 1996 లో పెట్టుబడుల ఉపసంహరణ కమిషన్‌ను నియమించారు. తర్వాత దీన్ని పునర్ వ్యవస్థీకరించి ఆర్.హెచ్.పాటిల్ అధ్యక్షతన కమిషన్‌ను నియమించారు. పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఎన్డీయే ప్రభుత్వం 2000 లో పెట్టుబడుల ఉపసంహరణ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది.

ప్రపంచీకరణ (Globalisation)

వస్తుసేవలు, మూలధనం, సాంకేతిక విజ్ఞానం, శ్రామికుల ప్రవాహానికి ఎలాంటి అవరోధాలు ఏర్పడకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అనుసంధానం చేసే ప్రక్రియను ప్రపంచీకరణగా వ్యవహరిస్తారు. ప్రపంచీకరణ నాలుగు అంశాల పరిధిలో జరుగుతుంది.

ఎ) వాణిజ్య అవరోధాలు తగ్గించి, వివిధ దేశాల మధ్య వస్తుసేవల ప్రవాహానికి ఉన్న ఇబ్బందులను తొలగించడం.
బి) సాంకేతిక విజ్ఞాన ప్రవాహానికి అనుకూల వాతావరణాన్ని కల్పించడం.
సి) మూలధన ప్రవాహానికి అనుకూల వాతావరణం కల్పించడం.
డి) శ్రామిక గమనశీలతను పెంచడానికి అనుకూలంగా ప్రోత్సహించడం.

ఆచార్య జగదీశ్ భగవతి 'దేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేసి వ్యాపారం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్వల్పకాల మూలధనం, మానవ వనరులు, సాంకేతిక విజ్ఞాన ప్రవాహాన్ని కొనసాగించడాన్ని స్వేచ్ఛా ఆర్థిక ప్రపంచీకరణ'గా నిర్వచించారు. 'దేశాల రాజకీయ సరిహద్దులను దాటి ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడమే ప్రపంచీకరణ' అని దీపక్ నాయర్ నిర్వచించారు.

ప్రపంచీకరణ లక్షణాలు

ఎ) అంతర్జాతీయ ద్రవ్య వ్యవహారాల్లో వేగవంతమైన వృద్ధి.
బి) వ్యాపార రంగంలో వృద్ధి వేగం సాధించడం, ప్రత్యేకించి బహుళజాతి సంస్థల వ్యాపార వృద్ధి.
సి) బహుళ జాతి సంస్థల ద్వారా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పెరుగుదల.
డి) గ్లోబల్ మార్కెట్ల ఆవిర్భావం.
ఇ) రవాణా, కమ్యూనికేషన్ రంగాల శీఘ్రతర వృద్ధి వల్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించడం.

ప్రపంచీకరణ దిశగా చర్యలు

భారతదేశం ప్రపంచీకరణ దిశగా మూడు ముఖ్యమైన చర్యలను చేపట్టింది. i) రూపాయి బహిర్గత విలువ సవరణ, రూపాయి పరివర్తనం.
ii) దిగుమతుల సరళీకరణ.
iii) వివిధ దేశీయ ఉత్పత్తి రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.

విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో ప్రభుత్వ జోక్యం లేకుండా డిమాండ్, సప్లయ్ శక్తుల ద్వారా ద్రవ్యం విలువను నిర్ణయించడాన్ని ప్రపంచీకరణ ప్రక్రియలో అతి ముఖ్యమైన చర్యగా పరిగణిస్తున్నారు. 1991 లో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత రూపాయిని పరివర్తనం చేసే ప్రయత్నం జరిగింది. ఈ దిశగా భారత ప్రభుత్వం రెండు దశల్లో జులై 1, 3 తేదీల్లో రూపాయి విలువను 18-19 శాతం వరకు తగ్గించి, మూల్యహీనీకరణ చేసింది.

ఆ తర్వాత సంపూర్ణ పరివర్తనం (Full Convertability) లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంలో పురోగమన చర్యలు చేపట్టింది. 1992-93 బడ్జెట్‌లో పాక్షిక పరివర్తనం ద్వారా ద్వంద్వ మారకరేటు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ పద్ధతిలో 40 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను అధికార రేటు వద్ద, మిగిలిన 60 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద ఎగుమతిదారులు పరివర్తనం చేసుకున్నారు. 1993-94 బడ్జెట్‌లో వాణిజ్య ఖాతా లావాదేవీల ద్వారా పొందిన మారకపు ద్రవ్యాన్ని సంపూర్ణంగా (మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద) పరివర్తనం చేసుకునే అవకాశం కల్పించింది. 1994 ఆగస్టు 19 న వర్తమాన ఖాతా లావాదేవీలకు సంపూర్ణ పరివర్తనాన్ని ప్రవేశపెట్టింది.

పార్వతి మృతి కేసులో నిందితుడి అరెస్టు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం పెద్దలోగిడి గ్రామ సమీపంలోని తోటలో ఆగస్టు 22న అగదల పార్వతి అనే యువతి శవమై కనిపించిన విషయం విధితమే. ఆమె ఆత్మహత్య చేసుకుందని, ఆ ఆత్మహత్యకు కారణమైన గంగువాడ గ్రామానికి చెందిన దాలి రాజారావు(19)ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... 22వ తేదీన అనుమానాస్పదంగా పార్వతి మృతదేహం లభ్యం కావడంతో కేసు నమోదు చేసుకున్నామని, శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎ.సుబ్రహ్మణ్యం దర్యాప్తు చేపట్టారని ఎస్ఐ చెప్పారు. విచారణలో పార్వతి దాలి రాజారావును ప్రేమించిందని, వివాహం చేసుకోమని కోరడంతో అతను నిరాకరించాడని తెలిసిందని పేర్కొన్నారు. పది రోజుల క్రితం పెద్దలోగిడి గ్రామ శివారు వద్ద ఈ విషయమై ఇరువురు మధ్య వాగ్వాదంచోటు చేసుకుందని, ఈ సందర్భంగా రాజారావు ఆమెను కొట్టాడని తెలిసిందని చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన పార్వతి సమీపంలోని మామిడి తోటలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. డీఎస్పీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పార్వతి మృతికి కారణమైన రాజారావును అరెస్టు చేసి, ఎస్.సి., ఎస్.టి. కోర్టు ముందు హాజరు పరచగా ఈ నెల 13వ తేదీ వరకు జిల్లా కేంద్ర కారాగారానికి రిమాండు నిమిత్తం పంపించినట్లు ఆయన తెలిపారు.



దాలి రాజారావు(దాచిన చిత్రం)

శ్రీముఖలింగేశ్వర దర్శనం

గురువారం వేకువజామున 5 గంటలకు సుప్రభాతసేవ, ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సర్వదర్శనం, ఆ సమయంలో శివ పంచాయతన ఉన్న లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అన్నభోగం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కవాటబంధనం, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, సాయంత్రం 5.30 గంటలకు నీరాజనం, సాయంత్రం 6 గంటల నుంచి లక్ష్మీ సహస్ర నామస్తోత్ర పారాయణం, క్షీరాన్నభోగం, మంత్రపుష్పం, రాత్రి 8 గంటలకు పవళింపుసేవ.

–న్యూస్‌టుడే(శ్రీముఖలింగం), జలుమూరు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: **ఆరాధన:** శతక శంఖారావం ముగింపు మహోత్సవం... 06-30: **అన్నదాత,** 07-00: **ఈటీవీ న్యూస్,** 07-30: **శుభమస్తు:** విద్యాగణపతి ప్రత్యేకత ఏమిటి? వ్యాపారం పెరగడానికి గణేశ శ్రీవాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: **టాలీవుడ్ టైమ్,** 09-00: **ఈనాడు సినిమా: పాడుతా తీయగా...** (వినీత్, హీరా).

మధ్యాహ్నం

12-00: **అభి'రుచి':** ఘుమ ఘుమలు **'వంకాయ బజ్జీ కూర',** మీచేతి వంట **'పెసల పులావ్',** **'మేథి క్యారెట్ ఫ్రై',** జస్ట్ ఎ మినిట్ **'బేసిన్ బర్ఫీ'** తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: **స్టార్ మహిళ** (మెగా గేమ్ షో), 02-00: **అభిషేకం** (డైలీ సీరియల్), 02-30: **అత్తారింటికి దారేది** (డైలీ సీరియల్), 03-00: **సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2)** (డైలీ సీరియల్), 03-30: **ఆడదే ఆధారం** (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: **వసంతం** (డైలీ సీరియల్), 04-30: **జీన్స్–2** (రిపీట్), 05-30: **ఆడాళ్ళా మజాకా:** రావులపాలెం అతివలు ఉత్సాహంగా పాల్గొన్న గేమ్ షో..., 06-00: **శ్రీ భాగవతం** (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: **ఒకరికి ఒకరు** (డైలీ సీరియల్)

రాత్రి

07-00: **సావిత్రి** (డైలీ సీరియల్), 07-30: **మనసు మమత** (డైలీ సీరియల్), 08-00: **స్వాతిచినుకులు** (డైలీ సీరియల్), 08-30: **నా పేరు మీనాక్షి** (డైలీ సీరియల్), 09-00: **ఈటీవీ న్యూస్,** 09-30: **జబర్దస్త్:** మనసారా నవ్వుకోవడానికి మంచి సమయం..., 10-30: **జబర్దస్త్ జల్సాటైం...**

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డిజె రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం
04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డిజె
10:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
★ ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ. 09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30).
★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మిస్ 420 (అశ్వని నాచప్ప, రాజ్‌కుమార్), 10-00: మార్నింగ్ షో: రాధా కల్యాణం (రాధిక, చంద్రమోహన్), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: పోకిరి రాజా (వెంకటేశ్, రోజా), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఖబడ్దార్ (సాయికుమార్, భావన), రాత్రి: 7-00: ఫస్ట్ షో: బుద్ధిమంతుడు (ఏఎన్నార్), 10-00: యువ దర్శకుడు హను రాఘవపూడితో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఫ్రైడ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ అండ్ మూంగ్ స్ప్రౌట్స్ దోశ, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఎగ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ చికెన్ నగ్గెట్స్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – చిట్టి చెగోడీలు & పులిహోర, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – స్వీట్ పన్నీర్ బుర్జీ, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (డయాబెటిక్ రెసిపీ) – డైజెస్టివ్ డ్రింక్, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - గన్ పౌడర్ & ఇడ్లీ, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (తమిళనాడు క్యూసైన్) - డ్రై ఫ్రూట్స్ సుజీయాం, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – రామ్ లడ్డూ, మ.12.30, రా.8.45: "కా అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - బ్రేక్‌ఫాస్ట్ ఉప్మా, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ప్రాన్స్ అండ్ బేబికార్న్ కట్‌లెట్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (మిక్స్డ్ క్యూసైన్) – లాంబ్ స్కీవర్స్ & జింజర్ గార్లిక్ ఆసియన్, మ.1.30, రా.10.00: చటపట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - చికెన్ మిర్చి బజ్జీ, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – కోల్హాపూరి పన్నీర్, మ.2.30: చోటా చెఫ్ – చికెన్ చీజ్, మ.5.15: స్నాక్స్ - పన్నీర్ చీజ్ తవ రోటీ.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **లాలిజో పాపాయి, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సిద్ధివినాయక స్వామి మందిరం, ప్రభాదేవి, ముంబయి, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ **అష్టవినాయక దర్శనం, మహారాష్ట్ర, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: **లాలిజో పాపాయి,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 31-08-2017

SVBC TTD — ఉదయం: 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రీపీట్), **సాయంత్రం:** 04-30 క్షేత్రదర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాధం + శ్రీనివాస గద్యం + లక్ష్మీనరసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 ఆలయదర్శనం - కర్నాటక, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం అశ్వమేధపర్వం.

భక్తి TV — ఉదయం: 06-00 సాయి హారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 08-00 గణపతి దర్శనం, 08-30 మహాగణపతిం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందే హాలు, **సాయంత్రం:** 04-30 గణపతి దర్శనం, 05-00 శ్రీగణేశస్తోత్రం, 05-30 సాయి గీతామృతం, 06-00 సద్గురు స్తోత్రం, 07-00 భక్తివిశేషాలు, **రాత్రి:** 07-30 అమృతకలశం, 08-00 మహాగణపతిం(లైవ్), 08-30 రామాయణ తరంగిణి, 09-00 జై..జై..గణేశా:, 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు — ఉదయం: 07-30 శుభమస్తు, 08-00 సినిమా: త్రిపుర, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా:పంచాక్షరి.

మా — ఉదయం: 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: **రాజా రాణి, మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: అందరివాడు, **సాయంత్రం:** 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

జెమిని — ఉదయం: 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ఇంగ్లీష్ పెళ్లాం ఈస్ట్ గోదావరి మొగుడు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: వీడే, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 09-30 సినిమా: జేమ్స్‌బాండ్.

కంది సాగులో మెలకువలు

కందిని రబీలో కూడా సాగు చేయవచ్చని అనంతపురం జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. పత్తి, మిరప, పొగాకుతోపాటు ప్రత్యామ్నాయ పంటలైన పెసర, మినుము, సోయాచిక్కుడు, వేరుసెనగ వంటి పంటల్లో మిశ్రమ పంటగా సాగు చేయవచ్చు. రబీలో సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో ఏక పంటగా లేదా సహ పంటగా విత్తుకోవచ్చు. రబీలో చీడపీడల బెడద తక్కువ. 5-6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. చౌడునేలలు, నీటి ముంపునకు గురయ్యే నేలలు పనికిరావు.

ఎరువులు: చివరి దుక్కిలో ఎకరాకు 2 టన్నుల పశువుల ఎరువు వేయాలి. ఖరీఫ్‌లో 8 కిలోలు, రబీలో 16 కిలోల చొప్పున నత్రజనిని అందించాలి. ఈ రెండు కాలాల్లోను 20 కిలోల చొప్పున భాస్వరం వేసుకోవాలి. అంతరపంటగా విత్తినప్పుడు, ఆయా పైరును బట్టి వేసే ఎరువు మోతాదు మారుతుంది. ప్రధాన పైరుకు అంతర పంటకు వేరువేరుగా ఎరువులు వేయాలి.

నీటి యాజమాన్యం: ఈశాన్య రుతుపవనాల ప్రభావం లేని ప్రాంతాల్లో రబీ కందికి 2 తేలికపాటి తడులు ఇవ్వాలి. ఈ తడులు మొగ్గ రాబోయే ముందు ఒకసారి, కాయదశలో మరోసారి ఇవ్వాలి.

కలుపు నివారణ: పెండిమిథాలిన్(30 శాతం) ఎకరాకు 1.0-1.5 లీటర్లు లేక అలాక్లోర్(50 శాతం) ఎకరాకు లీటరు చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజు కాని పిచికారి చేయాలి. విత్తిన 30, 60 రోజులప్పుడు గుంటకతో గాని, గొర్రుతో కాని అంతరకృషి చేయాలి.



ఆకుచుట్టు పురుగు ఆశించిన మొక్క

సస్యరక్షణ: కంది పెరిగే దశలో ఆకుచుట్టు పురుగు ఆశిస్తుంది. ఆకులను, పూతను చుట్టగా చుట్టుకుని లోపల ఉండి గీరి తింటాయి. దీని ఉధృతి ఎక్కువగా ఉంటే, 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 2 మి.లీ. క్వినాల్‌ఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

కాయతొలుచు పురుగు: ఈ పురుగు పూత, పిందె దశల్లో కాయలకు రంధ్రాలు చేసి గింజలను తింటూ ఒక కాయ నుంచి మరో కాయను ఆశిస్తుంది. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు తప్పక పాటించాలి.

మరుకా మచ్చల పురుగు: దీని నివారణకు క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి మందులను మార్చుతూ వారానికొకసారి పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఈ తెగులు సోకిన మొక్కలు పూర్తిగా కాని మొక్కలో కొంతభాగం గాని ఎండిపోతాయి. ఎండిన మొక్కలను పీకి కాండం మొదలు భాగం చీల్చి పరిశీలిస్తే గోధుమ వర్ణపు చారలు కనిపిస్తాయి. ఈ తెగులు నివారణకు ఎలాంటి మందులు లేనందున, పొగాకు లేదా జొన్నతో పంట మార్పిడి చేసుకోవాలి.

వెర్రితెగులు: ఈ తెగులు నల్లి ద్వారా వ్యాపిస్తుంది. నల్లి నివారణకు లీటరు నీటికి 3 గ్రాములు నీటిలో కరిగే గంధకపు పొడి కలిపి వారినికొకసారి చొప్పున రెండు దఫాలుగా పిచికారి చేయాలి.

మాక్రోఫోమినా తెగులు: ఈ తెగులు సోకిన మొక్కలు ఎండిపోతాయి. ఈ పంటను ఎక్కువ కాలం ఒకే పొలంలో వేయకుండా పంటమార్పిడి చేయాలి.

– న్యూస్‌టుడే, అనంతపురం (వ్యవసాయం)

వరిలో జింకు లోపం

వివిధ ప్రాంతాల్లో సాగుచేస్తున్న పైర్లలో ప్రస్తుతం జింకు ధాతు లోపం కనపడుతోంది. రాష్ట్రంలో దాదాపు 65-70 శాతం నేలల్లో జింకులోపం ఉన్నట్లు మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు. నల్లరేగడి నేలలు, క్షారభూములు, సున్నం అధికంగా ఉన్ననేలలు, మురుగునీరు నిల్వఉండే భూములు, వరుసగా వరిపంట సాగుచేసే నేలల్లో జింకు లోపాలు ఉంటాయన్నారు. ఈ లోపాన్ని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

లక్షణాలు: జింకులోపం ఉన్న వరిలో పైనుంచి 3 లేదా 4 ఆకులో స్పష్టంగా కనిపిస్తుంది. మధ్యఈనె ఆకుపచ్చ రంగును కోల్పోయి పసుపు వర్ణంగా మారి ఆకు చివర్లు మామూలు ఆకుపచ్చ రంగులోనే ఉంటాయి. ఒకోసారి ఈ లక్షణాలు నాటిన 2-4 వారాల మధ్య కనిపిస్తాయి. ఆకు చివర్లలో మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేక ముదురు ఇటుక రంగులాంటి చిన్న మచ్చలు కనిపించవచ్చు. ఈ మచ్చలన్నీ కలిసిపోయి ఆకంతా వ్యాపించవచ్చు. ఈ లక్షణం దుబ్బుల మొదళ్లలోని ముదురు ఆకులమీద సాధారణంగా కనిపిస్తుంది. మురుగునీరు పారుదల లేని భూముల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. జింకులోపం ఉన్న ఆకులు చిన్నవిగా, నూలు కండెల ఆకారం కలిగి పెళుసుగా ఉండి, వంచగానే శబ్దంచేస్తూ విరిగిపోతాయి.

నివారణ: ప్రతి మూడు పైర్లకు ఎకరానికి 20 కిలోల జింకు సల్ఫేటును నాటేముందు వేసి జింకులోపాన్ని నివారించవచ్చు. చవుడు భూముల్లో ఎకరానికి 40 కిలోల జింకు సల్ఫేటు వేయాలి. జింకు లోపం పైరుమీద గమనించగానే 2 గ్రా. జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారీ చేయాలి.

– న్యూస్‌టుడే, గొడుగుపేట



మందసలో ఇళ్లు, దుకాణాల నుంచి బయటకు వచ్చిన జనం

భూ ప్రకంపనం.. భయాందోళనలో జనం

మందస, న్యూస్‌టుడే: జిల్లాలో పలాస నియోజకవర్గంలోని మందస, హరిపురం ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం 3.55 గంటలకు స్వల్పంగా భూమి కంపించింది. ఉన్నట్టుండి ఇళ్లు, దుకాణాల్లోని వస్తువులు కదిలి చిన్న పాటి శబ్ధం రావడంతో అప్రమత్తమైన కొందరు కేకలు వేసుకుంటూ ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. వారిని చూసి మిగిలిన జనం వీధుల్లోకి పరుగెత్తారు. కొంతసేపటికి ప్రకంపనలు తగ్గాయని గుర్తించి తిరిగి ఇళ్లు, దుకాణాల్లోకి మళ్లీ వెళ్లారు. అంబుగాం, మకరజోల, వీజీపురం, కుంటికోట ప్రాంతాల్లోనూ భూమి కంపించడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందారు.

సోంపేటలో స్వల్పంగా...

సోంపేట, న్యూస్‌టుడే: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని సోంపేట, బారువ, మామిడిపల్లి, కొర్లాం తదితర ప్రాంతాలలో బుధవారం సాయంత్రం స్వల్పంగా భూమి కంపించింది. సాయంత్రం 4 గంటల సమయంలో కొన్ని సెకన్లపాటు భూమి కంపించడంతో ఇళ్లల్లో నుంచి ప్రజలు బయటకు పరుగులు తీశారు. ఒక వైపు ఆకాశం మేఘావృతమై ఉండడం, ఉరుములు, మెరుపులతో ఇబ్బందికర వాతావరణం ఏర్పడిన సమయంలోనే భూమి కంపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. కంచిలి మండలం మఠంసరియాపల్లి పరిధి గ్రామాల్లో సాయంత్రం 3.30 గంటల నుంచి 5 గంటల వరకు ఏకధాటిగా భారీ వర్షం కురవడంతో మోడల్ స్కూల్‌తో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. గంటన్నరసేపు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలల్లోనే గడపాల్సివచ్చింది. ఆ సమయంలో అరవసరియాపల్లి, గెద్దలపాడు, సిర్తలి గ్రామాల పరిధిలో పిడుగులు పడడంతో స్థానికులు ఆందోళన చెందారు.



బారువలో ఇళ్ల నుంచి బయటకు వచ్చిన జనం

దస్త్రాలలోనే లేదు..

● నిధులు మాత్రం మంజూరు ● రెండేళ్లయినా ప్రారంభంకాని రహదారి ● తీరని గ్రామస్థుల కష్టాలు



అరదలి గ్రామ రహదారి

న్యూస్‌టుడే, పాలకొండ

మండలంలోని అరదలి గ్రామ రహదారికి రూ.60 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. రహదారి అధ్వానంగా ఉండడంతో అధికారులు నిధుల కోసం పంపిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులు ఆమోదించారు. దీంతో అధికారులు రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. కానీ వీపీరాజుపేట గ్రామస్థులు రహధారి పనులు అడ్డుకున్నారు. గతంలో తాము రహదారి నిర్మాణానికి స్థలం అందించామని, అది తమ సొంత భూములు మీదుగా నిర్మాణం చేపట్టారని, తిరిగి భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. దీంతో అధికారులు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రెవెన్యూ అధికారులతో కలిసి పంచాతీ రాజ్ అధికారులు రికార్డులు పరిశీలించారు. అరదలి గ్రామం నుంచి అర్ధ కిలోమీటరు వరకు మాత్రమే రికార్డుల్లో రహదారి ఉంది.

స్థానిక నాయకుల జోక్యం అవసరం

ఇప్పటికీ మండలంలో చాలా రహదారులు మెరుగుపడలేదు. నిధులు మంజూరైన అరదలి గ్రామ రహదారికి నిధులు విడుదలైనా స్థల సమస్య కారణంగా నిలిచిపోయింది. ఈ సమయంలో స్థానిక నాయకులు జోక్యం చేసుకుని రైతులను ఒప్పించాల్సిన బాధ్యత వారిపై ఉంది. దశాబ్దాలుగా అరదలి గ్రామస్థులు రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలోనే నాయకులు రైతులను ఒప్పించి రహదారి నిర్మాణం జరిగేలా చూడాల్సిన బాధ్యత వారిపై ఉంది.

నిధులున్నా...

వీపీరాజుపేట కూడలి నుంచి కిలోమీటరు దూరం వరకు అరదలికి కచ్చా రహదారి ఉంది. ఈ రహదారి నిర్మాణానికి పంచాయతీ రాజ్ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు. దీంతో ఉన్నతాధికారులు రూ.60 లక్షలు నిధులు కేటాయించారు. నిధులు మంజూరై రెండేళ్లు గడుస్తోంది. ఈ లోగా మూడు మార్లు టెండర్లు పిలిచారు. గుత్తేదారులతో అగ్రిమెట్లు కూడా చేయించారు. కానీ రహదారి నిర్మాణానికి స్థల సమస్య కారణంగా అగ్రిమెంట్లు రద్దయ్యాయి.

మూడు మీటర్లు అవసరం

ప్రస్తుతం అరదలి గ్రామ రహధారి మూడు నుంచి 3.5 మీటర్ల వెడల్పులో ఉంది. అధికారులు కొత్తగా రహదారి నిర్మాణానికి 7.5 మీటర్ల వెడల్పు అవసరం. ఇందులో 3.75 మీటర్ల మేర తారు రహదారిని వేస్తారు. మిగిలిన విస్తీర్ణంలో రహదారిని వెడల్పు చేస్తారు. ప్రస్తుతం ఉన్న రహదారికి కనీసం ఇరువైపులా మూడు మీటర్ల మేర భూములు అవసరం ఉంది.

రహదారితో అవస్థలు

ప్రస్తుతం అరదలి గ్రామస్థులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కచ్చా రహదారి కావడంతో వర్షాలు కురిస్తే రహదారి పలు చోట్ల గోతులమయమైంది. ఆటోలు సైతం వెళ్లేందుకు అనువుగా లేదు. ఇక అత్యవసర సమయాల్లో 108 వాహనం రావడం కష్టతరంగానే ఉంది.

ఉన్నతాధికారులకు నివేదించాం


సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ స్థల సమస్య కారణంగా రహదారి నిర్మాణం చేపట్టలేకపోతున్నాం. రెవెన్యూ రికార్డుల్లో కొంత మేర మాత్రమే అరదలి గ్రామం నుంచి రహదారి ఉంది. దీంతో రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటికే మూడు మార్లు టెండర్లు పిలిచాం. స్థల సమస్య కారణంగా అగ్రిమెంట్లు సైతం రద్దు చేయాల్సి వచ్చింది.

–ఎస్.రాధారాణి, డీఈ, పంచాయతీరాజ్

పాపులర్ కప్‌ను కైవసం చేసుకున్న బెంగాల్ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో మూలపాడులోని డాక్టర్ గోకరాజు లైలా గంగరాజు ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్ నిర్వహించిన క్వాడ్రాంగులర్ క్రికెట్ టోర్నీలో బెంగాల్ జట్టు 'పాపులర్ కప్'ను కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన ముగింపు కార్యక్రమానికి బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీని బహూకరించారు. టోర్నీలో టి.వంశీకృష్ణ(ఆంధ్రా బ్లూ), రోషన్ సింగ్, ఆకాష్ పాండే(బెంగాల్), సనిధ్య హోర్కర్ (ఛత్తీస్‌గఢ్)లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి చుక్కపల్లి అరుణ్‌కుమార్, ఏసీఏ సెంట్రల్ జోన్ కార్యదర్శి కోకా రమేష్, ఏసీఏ క్రికెట్ ఆపరేషన్స్ డైరెక్టర్ డాక్టర్ కింజల్ సూరత్‌వాలా, తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాల నడుమ పరీక్షలు



వరండాలో బల్లలపై పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో నాలుగు రోజులుగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరీక్షలు జరుగుతున్నాయి. పలు అసౌకర్యాల మధ్య అభ్యర్థులు పరీక్షలకు రాస్తున్నారు. కళాశాలకు ఐదు గదులు ఉండగా పాతపట్నం, పలాస, టెక్కలి ఓపెన్ యూనివర్శిటీ కేంద్రాల నుంచి 730 మంది వరకు అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఒకే బల్లపై ముగ్గురు లేదా నలుగురు పరీక్షలు రాస్తున్నారు. భవనాలు చాలకపోవడంతో వరండాలో పరీక్షలు రాస్తున్నారు. వందల సంఖ్యలో మహిళలు, పురుషులు పరీక్ష కేంద్రాలకు వస్తున్నప్పటికీ అరకొరగా మరుగుదొడ్లు ఉన్నాయి. సుదూరాల నుంచి వచ్చిన వారికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుఉన్నాయి. ఒక కేంద్రానికి సరిపడే భవనాలు, వసతులు ఉన్నప్పటికీ మూడు కేంద్రాల పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తుండడంతో అభ్యర్థులు ఇక్కట్లు పడుతున్నారు. వచ్చిన అభ్యర్థులకు సకాలంలో ప్రశ్నాపత్రాలు, ఇతర వసతులు కల్పించలేకపోవడంతో ప్రతి రోజూ సుమారు గంట వరకు ఆలస్యం జరుగుతుందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదే విషయాన్ని పరీక్ష పరిశీలకులు రవిశంకర్‌కు తెలియజేయగా అభ్యర్థులు ఎక్కువగా ఉన్నారని, భవనాల సదుపాయం తక్కువగా ఉండటం వల్ల ఈ పరిస్థితి ఉందని తెలిపారు.

ఆలస్యంగా ప్రశ్నాపత్రాలు



సుదూరాల ప్రాంతాల నుంచి పాతపట్నం కేంద్రం వచ్చేసరికి ఇబ్బందికరంగా ఉంది. ఏ గదిలో కూర్చుని రాయోలో తెలిపే నెంబరింగ్ బోర్డు లేకపోవడంతో బల్లలు వెతికేందుకు ఆలస్యమవుతోంది. ప్రశ్నాపత్రాలను కూడా ఆలస్యంగా ఇస్తున్నారు. దీంతో సమయం తక్కువగా ఉంటోంది.

–ఎం.వి.సంతోష్‌రావు, అరసవల్లి

అసౌకర్యంగా పరీక్ష కేంద్రం



పట్టణానికి శివారున డిగ్రీ కళాశాల ఉంది. సుమారు రెండు కిలో మీటర్లు దూరం నడిచి రావాల్సి వస్తోంది. అంతదూరం వచ్చినా పరీక్షలు రాసేందుకు కనీస వసతులు లేవు. పరీక్ష కేంద్రంలో బల్లలు లేకపోవడంతో ఇరుకుగా కూర్చుని రాయాల్సి వస్తోంది.

–దువ్వారి చలపతిరావు, పాతపట్నం



రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

వ్యక్తి అనుమానాస్పద మృతి


పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం పట్టణ శివారు కోదూరు పంచాయతీ పరిధిలోని ఆల్‌ఆంధ్రా రహదారికి పక్కన ఇంట్లో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, స్థానికులు తెలియజేసిన సమాచారం మేరకు... గ్రామానికి శివారున గృహం నిర్మించుకుని పొట్నూరు రమేష్(45) అనే వ్యక్తి నివసిస్తున్నాడు. బుధవారం ఉదయం రమేష్ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో లోపలికి వెళ్లి చూసిన స్థానికులకు రమేష్ మృతదేహం కనిపించింది. ఇటీవల పిల్లలతో పుట్టింటికి వెళ్లిన రమేష్ భార్యకు ఈ సమాచారాన్ని అందించారు. ఆయన చేతిలో విద్యుత్ తీగలు ఉండడంతో విద్యుదాఘాతంతో మృతిచెంది ఉంటాడని పలువురు భావిస్తున్నారు. గ్రామానికి సుదూరంలో ఉండడంతో ఎవరూ గమనించలేదని, ఆయన మృతిచెంది సుమారు మూడు నాలుగు రోజులు అయి ఉంటుందని తెలిపారు. సామాజిక ఆసుపత్రి వైద్యులు పోస్టు మార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. హెచ్‌సీ రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



జీవితం అంటేనే పోరాటం, అది ఎప్పుడూ ధర్మం వైపునే ఉండాలి
– గౌతమ బుద్ధుడు



వడ్రంగి పిట్ట దాని ముక్కుతో చాలా వేగంగా చెట్టుకు రంధ్రం చేసేయగలదు. ఒక్క సెకెనులో అది ఏకంగా 20 సార్లు చెట్టుని పొడిచేయగలదంటే నమ్మగలరా?





పదమూడేళ్ల పిల్లాడు... యోగా గురువయ్యాడు!

■ **ఎవరీ పిల్లాడు? మన పేజీలోకి ఎందుకొచ్చాడు?**

బోలెడు ఆసనాలు నేర్పించే యోగా గురువు. ఇంత వరకే అయితే చెప్పక్కర్లేదు. మన దగ్గర చిన్నారులు యోగా నేర్చుకోవడం మామూలే కావచ్చు. కానీ ఈ అబ్బాయిది మనదేశమే కాదు. అందుకే మన పేజీలోకి వచ్చాడు మరి.

■ **మరి పేరేంటీ? ఊరేంటీ?**

ఈ అబ్బాయి పేరు అడమ్ అవిన్. వయసు పదమూడేళ్లు. ఉండేది అమెరికా ఫ్లోరిడాలోని ఫోర్ట్ లాడెర్‌డేల్.

■ **అసలీ అబ్బాయి యోగా ఎక్కడ నేర్పిస్తాడు?**

పొద్దున్నే టీవీలో యోగా నేర్పించడం చూసే ఉంటారుగా. అలా ఈ పిల్లాడు కూడా ఇక్కడి 'చిల్డ్రన్స్ టెలివిజన్ నెట్‌వర్క్'లో చిన్నారులకు యోగాసనాలు చెబుతుంటాడు. ఈ కార్యక్రమానికి 'వుఫ్ శాంతి' అని పేరు కూడా పెట్టారు. పిల్లలకు బొమ్మలంటే తెగ ఇష్టం కదా... అందుకే అడమ్... పెద్ద కుక్కబొమ్మలాంటి దుస్తులు వేసుకుని టెడ్డీబేర్‌లా వస్తాడు. కెమెరా ముందు అక్కడున్న చిన్నారులకు రకరకాల ఆసనాలు నేర్పిస్తాడు. మంచి మంచి విషయాలు చెబుతుంటాడు. ప్రస్తుతం అక్కడ ప్రసారమయ్యే ఈ యోగా కార్యక్రమానికి ఆదరణ బాగా పెరిగిపోయిందట. అందుకే త్వరలో అమెరికా మొత్తం ప్రసారాలు చేయనున్నారు. ఫ్లోరిడాలో 'అతి చిన్న యోగా గురువు'గా పేరు తెచ్చేసుకుని ఫేస్‌బుక్‌ల్లాంటి వాటిల్లో వేల మంది అభిమానుల్ని తెచ్చేసుకున్నాడీ బుల్లి గురువు. అంతేకాదూ... చిన్నారుల ఆసుపత్రులకు వెళ్లి వాళ్లు సంతోషంగా ఉండటానికి సరదాగా యోగాసనాలు నేర్పిస్తున్నాడట.

■ **ఇంతకీ అడమ్‌కీ యోగాపై ఆసక్తి ఎలా వచ్చింది?**

అడమ్ వాళ్ల తాతయ్య 'నువ్వు నవ్వితే ప్రపంచమూ నవ్వుతుంది', 'నవ్వుతూ కృతజ్ఞతలు చెప్పాలి', 'మంచిగా ఆలోచిస్తే మంచే జరుగుతుంది' అనే మూడు మంత్రాలు చెప్పాడట. వాటి ప్రాముఖ్యతను అందరికీ చెప్పడానికి ఈ అబ్బాయి యోగా నేర్చుకుని పిల్లలకు చెప్పడం మొదలుపెట్టాడట. అడమ్ వాళ్ల అమ్మ రాసిన 'మై గ్రాండ్-డాగ్ వజ్ ఎ యోగా ఇన్‌స్ట్రక్టర్' పుస్తకానికి ఈ బుల్లి గురువు బొమ్మ కూడా వేశాడు. అచ్చం ఆ బొమ్మ వేషంలోనే తయారై టీవీలో యోగా చెప్పేస్తున్నాడన్నమాట.

■ **మరి మనం చూడలేమా?**

చక్కగా చూడొచ్చు. యూట్యూబ్‌లో ఈ కార్యక్రమానికి చెందిన వీడియోలున్నాయి. ఇంకా... త్వరలోనే యాపిల్ టీవీ, అమెజాన్ ఫైర్ టీవీ స్టిక్, సామ్‌సంగ్ స్మార్ట్ టెలివిజన్‌ల్లో ఈ యోగా గురువు కనిపించబోతున్నాడట.

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Quip = ఎగతాళి
- మాతృక = అసలు గ్రంథం

నవ్వుల జల్లులు!

బిట్టు: అక్కా! కంచంలో భోజనంతో పాటు రెండు స్పూన్లు కూడా వేశావెందుకు?

అక్క: నువ్వే కదరా రెండు స్పూన్లు నెయ్యి వెయ్యమన్నావు!

– **డి. శ్రీలత,** హైదరాబాద్

....

తల్లి: చింటూ! బొంబాయి రవ్వ తీసుకురా ఉప్మా చేసి పెడతా...

చింటు: ఇప్పుడు నేనొక్కడినే బొంబాయి వరకూ ఎలా వెళతానమ్మా!


– **మా.శ్రీ. రాజు,** పాల్వంచ

చిలిపి ప్రశ్న


తెల్లకోడిపుంజు గుడ్డు ఏ రంగులో ఉంటుంది?


– **ఆర్. శ్యామల,** హైదరాబాద్

కవలలేరి?



a


b


c


d

దారేది?



సుడోకు


ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3X3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.

2			4					
		6			7			3
	7	3	8	6		4		
4	2				1		3	
3				9				7
	6		2				9	8
		4		2	5	3	1	
6			3			5		
					4			2

రాయగలరా?

ఆధారాలతో ఆంగ్ల పదాలు రాసి రంగు గడుల్లోని అక్షరాల్ని వరుసగా చదివితే ఓ పదం వస్తుంది

ఆధారాలు:
1. హంస 2. కోతి 3. ఎలుక 4. పాము 5. గుడ్లగూబ 6. గాడిద



జవాబు: ఇవన్నీ కూడా... మెల్లగా వీచే గాలిలో ఒక్కసారిగా మార్పులు రావడం ద్వారా గాలి వేగం మోతాదు పెరిగిపోవటం వల్ల తలెత్తే భారీ ప్రకృతి వైపరిత్యాలే. ఇవి పరిసరాల్ని నాగరిక జీవనాన్ని అతలాకుతలం చేస్తాయి. అయితే హరికేన్‌లు, టైఫూన్‌ల మధ్య తేడాని సాధారణంగా గాలి వేగాన్ని బట్టి విడమరుస్తారు. గాలివేగం గంటకు వంద కిలోమీటర్లను మించితే అది హరికేన్. గాలివేగం అంతకన్నా తక్కువగా ఉన్నట్లయితే టైఫూన్లు అంటారు. సైక్లోన్లు అంటే సముద్ర ఉపరితలంలో అల్పపీడన ద్రోణులు ఏర్పడ్డప్పుడు.... గాలి భూభాగం నుంచి సముద్రంలోకి వెళ్లి అక్కడ నీటి ఆవిరిని నింపుకుని తిరిగి తీర ప్రాంతాలకు చేరి ఉధృతమైన వర్షపాతానికి దారి తీస్తుంది. బంగాళాఖాతం, హిందూ మహా సముద్రాల్లో ఇలాంటి ద్రోణులు ఎక్కువగా ఏర్పడుతుంటాయి. గాలిలో పీడనాలు మారినా లేదా సైక్లోన్ల ద్వారా పెనుగాలులు వీచినట్లయితే వాటిని తుపాన్లు అంటుంటారు. శాస్త్రీయంగా ఈ నాల్గింటి మధ్య కచ్చితమైన వ్యత్యాసం లేదు. అమెరికా, మధ్య అమెరికా ప్రజలు అన్ని రకాల గాలి దుమారాల్నీ హరికేన్‌లు, టైఫూన్లు అంటుంటారు. ఆసియాలోని మనం వీటిని తుపానులు, సైక్లోన్‌లు అంటాం.

– **ప్రొ॥ ఎ. రామచంద్రయ్య,** నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక(తెలంగాణ)

జవాబులు: **రాయగలరా:** 1.Swan 2. Monkey 3. Rat 4. Snake 5. Owl 6. Donkey దాగిన పదం: Season **కవలలేరి:** a, c **చిలిపిప్రశ్న:** అసలు కోడి పుంజు గుడ్డే పెట్టదుగా!

సుడోకు:

2	5	1	4	3	9	7	8	6
8	4	6	1	5	7	9	2	3
9	7	3	8	6	2	4	5	1
4	2	9	7	8	1	6	3	5
3	1	8	5	9	6	2	4	7
5	6	7	2	4	3	1	9	8
7	8	4	6	2	5	3	1	9
6	9	2	3	1	8	5	7	4
1	3	5	9	7	4	8	6	2

మా చిరునామా: హాయ్‌బుజ్జీ విభాగం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా 501 512 email : hai@eenadu.net

'ఉత్తి' పోతలే!

(మొదటిపేజీ తరువాయి) చెబుతున్నారు. కావాల్సిన గుత్తేదారు సంస్థకు పనులు కట్టబెట్టేందుకే వాయిదా వేశారన్న అనుమానాలు ముసురుకుంటున్నాయి. గొట్టాలు, పంపుల నిర్మాణాలకు సమాంతరంగానే.. సరఫరా కాలువలకు విడిగా టెండర్లు పిలిచే అవకాశాన్ని మరుగున పెట్టడమే ఆరోపణలకు అద్దం పడుతోంది. ఒకవేళ నిజంగా రెండింటికి ఒకేసారి టెండర్లు పిలవాలనే అలా చేసి ఉంటే.. ఇంజినీరింగు అధికారుల దూరదృష్టి లోపమే కారణంగా అధికార వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

అలా అలా సాగుతూ..

అంతకు ముందు రూ. 133.14 కోట్లతో టెండర్లు పిలిచి గుత్తేదారు సంస్థలతో ఒప్పందం ఖరారు చేసుకున్న పది ఎత్తిపోతల పథకాల్లో కేవలం మూడు మాత్రమే పూర్తయ్యాయి. కోటబొమ్మాళి మండలం నారాయణపురం, చినసాన.. నందిగాం మండలం సుభద్రాపురం ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఇటీవలనే ప్రయోగాత్మకంగా పంపులను ఆన్ చేశారు. చిన్నచిన్న లోటుపాట్లను సరిచేసుకుని పది పదిహేను రోజుల్లో ప్రారంభించాలని సంకల్పించారు. ఇటీవల రాజధానిలో మంత్రి అచ్చెన్నాయుడు నిర్వహించిన సమీక్షలోనూ అధికారులు ఇదే సమాధానం చెప్పారు. పాతపట్నం మండలం కొరసవాడ ఎత్తిపోతల పథకం కూడా దాదాపుగా పూర్తయింది. ట్రయల్‌రన్ వేసి ఆయకట్టుకు నీరిస్తున్నారు. కోటబొమ్మాళి మండలంలోనే కొండపేట ఎత్తిపోతల పథకం కింద తొలుత 2,500 ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించారు. ఇంతవరకు ఒక వరుస గొట్టాల నిర్మాణమే పూర్తయింది. ఆ మేరకు ఆయకట్టులో కేవలం 800 ఎకరాలకు మాత్రమే నీరిస్తున్నారు. రెండో పైపులైన్ నిర్మాణాన్ని సెప్టెంబరు ఆఖరుకు పూర్తి చేస్తామని ఇంజినీరింగు వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రూ. 34.38 కోట్లతో చేపట్టిన మదనగోపాల సాగరం ఎత్తిపోతల పథకానికి ఇటీవల టెండర్లు పూర్తి గుత్తేదారుతో ఒప్పందం ఖరారు చేసుకోవడంతో పనులు ఇంకా ఆశించినంత వేగంగా ముందుకు సాగడం లేదు. గార మండలం కళింగపట్నం, మెళియాపుట్టి మండలం పెద్దపద్మపురం ఎత్తిపోతల పథకాల పనులు టెండర్ల దశను ముగించుకుని.. గుత్తేదారులతో ఒప్పందాలు చేసుకున్నప్పటికీ ఇంకా పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం నదుల్లో నీరుండటంతో పంపుల అమరిక కష్టం కావడంతోనే ఆలస్యం జరుగుతున్నట్లు ఇంజినీరింగు వర్గాలు చెబుతున్నాయి. బూర్జ మండలం నీలాదేవపురం ఎత్తిపోతల పథకానికి సంబంధించి 50 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. వచ్చే ఏడాదికి గాని పూర్తి చేయలేమన్నది అధికారుల ఉవాచ.

15 పథకాలకు అనుమతులే కీలకం

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి అచ్చెన్నాయుడి చొరవతో ఇటీవల దాదాపు 15 కొత్త ఎత్తిపోతల పథకాలను నీటిపారుదల అభివృద్ధి సంస్థ ప్రతిపాదించింది. వీటి అంచనా విలువ రూ. 309.23 కోట్లు. వీటిపై సుమారుగా 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధాన కాలువల ద్వారా నీటిని పంపించే అవకాశం లేని ఎత్తైన ప్రదేశాల్లో ఆయకట్టును ఈ పథకాల కింద చేర్చారు. ఈ పథకాలకు ప్రధాన నీటివనరులు.. వంశధార, మహేంద్రతనయతో బాటు వివిధ గెడ్డలు ఉన్నాయి. రెండింటికి వంశధార ప్రధాన కాలువలపైనే నిర్మించే విధంగా ప్రతిపాదించారు. ఒకవిధంగా ఈ రెండు ప్రయోగాలే. అసలే చివరి ఆయకట్టుకు నీరు వెళ్లని దుస్థితిలో.. కోటబొమ్మాళి మండలం సౌడాం, హిరమండలం మండలం మజ్జిగూడెం వద్ద రెండు ఎత్తిపోతల పథకాలకు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ రెండింటికి సుమారుగా 37 క్యూసెక్కుల నీరు అవసరం. మంత్రి ఒత్తిడితో ఎట్టకేలకు ఈ రెండింటికి నీటి లభ్యత అనుమతులను ఇస్తూ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రెండింటినీ మినహాయిస్తే.. మిగిలిన 13 పథకాలకు సంబంధించి నీటి లభ్యత అనుమతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు నిలిచిపోయాయి. వంశధార, మహేంద్రతనయ, రెల్లిగెడ్డ, ఇసుక గెడ్డ, పూతికవలస గెడ్డ, పాలవలసగెడ్డ, చీపిగెడ్డలపై ఈ ఎత్తిపోతలను పథకాలను ప్రతిపాదించారు. కొత్తూరు మండలం మాతల, కడుమ ఎత్తిపోతల పథకాలు వంశధార నదిపైనే ఏర్పాటు చేయాల్సి ఉంది. మెళియాపుట్టి మండలంలోని కొసమాల, రట్టిని, నడసంద్ర, వసుంధర ఎత్తిపోతలను మహేంద్రతనయపై ఏర్పాటు చేసేలా ప్రతిపాదించారు. సీతంపేట మండలం కొండపల్లి, తురాయిపువలస ఎత్తిపోతల పథకాలను ఇసుక గెడ్డపై, సీతంపేట మండలంలోని పూతికవలస ఎత్తిపోతల పథకాన్ని పాలవలస గెడ్డపైనా.. మందస మండలం చీపి ఎత్తిపోతల పథకాన్ని చీపిగెడ్డపైనా.. పొందూరు మండలం తండ్యాం, లైడాం ఎత్తిపోతల పథకాలను రెల్లిగెడ్డపైనా ప్రతిపాదించారు. వీటిలో తండ్యాం ఎత్తిపోతల పథకంపై సుమారు 3,292 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. లైడాంపై 1,174 ఎకరాలతో.. ఆయకట్టులో మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

నీటి లభ్యతల్లో తేడాలు

మహేంద్రతనయపై అంతర్రాష్ట్ర సమస్యలు ఉన్నాయి. ఇతర గెడ్డల్లో కూడా నీటి లభ్యత అంచనాలకు నిర్దిష్ట ప్రమాణాలు లేవు. గెడ్డలపై నీటి అంచనా వేయడం కష్టం. మహేంద్రతనయతో సహా వివిధ గెడ్డలన్నింటినీ నీటి ప్రవాహాన్ని కొలిచేందుకు రివర్ గేజ్‌లు లేవు. ఈ క్రమంలోనే ఉజ్జాయింపు లెక్కలతో..అంచనాను లెక్కించే సబ్-డివిజన్‌లో అందుబాటులో లెక్కలనే ప్రామాణికంగా తీసుకుని అధికారులు ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనల ఆధారంగానే నీటి లభ్యత అనుమతులకు జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) అనుమతులను మంజూరు చేయాల్సి ఉంది. అనుమతుల మంజూరులో ఈఎన్సీ ఎప్పటికప్పుడు కొర్రీలు వేసి పంపిస్తోంది. వారు అడిగిన వాటికి సమాధానాలను పంపిస్తున్నా.. మళ్లీ మళ్లీ కొర్రీలు పడుతున్నాయి. ఈ క్రమంలో రాజకీయంగా పలుకుబడి ఉపయోగించి మంజూరు చేయించుకోవడం వినా గత్యంతరం లేదనేది ఇంజినీరింగు వర్గాల భావన.

పక్కా ఆధారాలతోనే నివేదికలు

నీటి లభ్యతపై అధికారికంగా తీసుకున్న పక్కా ఆధారాలతోనే ప్రతిపాదనలు పంపించాం. నీటి అనుమతుల కోసం ఈఎన్‌సీ కార్యాలయానికి పంపించాం. అక్కడే పెండింగులో ఉన్నాయి. వంశధార కాలువపై ప్రతిపాదించిన రెండు పథకాలకు ఇటీవల ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. చిన్న చిన్న పథకాలకు స్థానికంగా జలవనరుల శాఖ ఎస్ఈ స్థాయిలోనే అనుమతులు ఇవ్వొచ్చు. బొంతు పథకానికి సంబంధించి సరఫరా కాలువలను కూడా చేర్చి ఒకేసారి టెండర్లు పిలవాలన్న ఉన్నత స్థాయి అధికారుల నిర్ణయంతోనే ఈ నెల 31 గడువుతో పిలిచిన టెండర్లను రద్దు చేయాల్సి వచ్చింది. మరో పది పదిహేను రోజుల్లోనే ఆ పథకానికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

- పి.లక్ష్మీపతి, పర్యవేక్షక ఇంజనీరు, నీటిపారుదల అభివృద్ధి సంస్థ, శ్రీకాకుళం



ప్రకృతి కన్నెర్ర చేసినా దక్కని కరుణ: పిడుగుపాటుకు మృతి చెందిన జీవాలు (దాచిన చిత్రం)

ఏదీ భీమా..?!

(మొదటిపేజీ తరువాయి) పరిస్థితి. ప్రకృతి వైపరీత్యాలు, రహదారి ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, వ్యాధులలో మృత్యువాత పడినా పాడి పశువులకు బీమా సౌకర్యం లేకపోవడంతో.. ప్రస్తుతం పాల డైరీలు నిర్వహించేవారు, ఇళ్ల వద్ద పాడి పశువులు పెంచేవారు ఏదైనా కారణంతో పశువులు మృతి చెందితే.. పూర్తిగా నష్టపోతున్నారు. పరోక్షంగా ఇది పాడి పెంపకంపై ప్రభావం చూపుతోంది.

నిధుల కేటాయింపుతో సరి..: 'పాడితోనే ప్రగతి.. రెండెంకెల అభివృద్ధే లక్ష్యం..' అంటూ సమావేశాలలో ప్రకటనలు గుప్పిస్తున్న పాలకుల మాటలు పాడి రైతులకు భరోసా ఇవ్వలేకపోతున్నాయి. ప్రభుత్వం ఏటా పాడి పశువుల ప్రగతికి రూ. కోట్లు కేటాయిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. రాష్ట్రంలోనే వెనుకబడిన పాతపట్నం నియోజకవర్గాన్ని ప్రగతి బాట పట్టించేందుకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 2016-17 సంవత్సరానికి రూ. 10 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో పాడి రైతులను గుర్తించి పాడి యూనిట్లు మంజూరు చేయాలి. తద్వారా పాల ఉత్పత్తి పెంపునకు కృషి చేయాలి. కానీ, ఇప్పటివరకు యూనిట్లకు అర్హులైన పాడి రైతులను గుర్తింపు కోసం దరఖాస్తులను స్వీకరించారు. పాడి పశువులను పొరుగున ఉన్న ఒడిశాలో కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ, లబ్ధిదారుల ఎంపిక, పాడి పశువుల కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

గతంలో ఇలా..: పశుబీమా పథకంలో పాడిపశువుల విలువ ఆధారంగా ప్రీమియం, నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియలుండేవి. ఇవి ఏడాదికోసారి, మూడు సంవత్సరాలకోసారి వార్షిక ప్రీమియం విధానంలో కొనసాగేవి. ఉదాహరణకు రూ. 10 వేల విలువ చేసే ఆవుకు ఏడాదికి రూ. 210 చెల్లించాలి. ఆ ఆవు ప్రమాదవశాత్తు మృతి చెందితే.. బీమా పథకం ద్వారా రూ. 10 వేల పరిహారం అందేది. మేకకు రూ. 130 చెల్లిస్తే రూ. 3 వేల చొప్పున, గొర్రెకు రూ. 85 చెల్లిస్తే రూ. 1500 చొప్పున బీమా పరిహారం వచ్చేది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలలో వెనుకబడిన వారిని ప్రోత్సహించేందుకు క్షీరసాగరం, సునందిని పథకాల్లోనూ పశువుల బీమా సౌకర్యం కూడా ఉండేది. గత మూడేళ్లుగా బీమా సౌకర్యం లేక పాడి రైతులు నష్టపోతున్నారు.

జిల్లాలో పశువులు ఇలా.. (అధికారికంగా)

గోజాతి పశువులు	- 7.95 లక్షలు
గేదె జాతి పశువులు	- 1.27 లక్షలు
బ్రీడబుల్ పాపులేషన్ గోజాతి పశువులు	- 3.86 లక్షలు
గేదె జాతి పశువులు	- 62 వేలు
గొర్రెలు	- 5.73 లక్షలు
మేకలు	- 2.12 లక్షలు
పెరటి కోళ్లు	- 12.14 లక్షలు
ఫారం కోళ్లు	- 8.8 లక్షలు
ఇతరాలు	- 9 వేలు

మూడేళ్లుగా అమలు కాని పథకం: గత మూడేళ్లుగా పశుబీమా పథకం రాష్ట్రంలో అమలు కావడం లేదు. రాష్ట్ర విభజన సమయంలో పశుసంవర్ధక శాఖకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను 9, 10 షెడ్యూళ్లలో చేర్చారు. ఇందులో మన రాష్ట్రానికి రావాల్సిన బడ్జెట్ నిధులు ఉన్నాయి. అవి ఇంతవరకు విడుదల కాలేదు. ఈ అంశంపై ఇంకా చర్చల్లోనే ఉండడంతో.. పశుబీమా పథకం అమలు కాస్తా అటకెక్కింది. మూడేళ్లుగా పాడి రైతుల నుంచి ప్రీమియం వసూలు, పరిహారం చెల్లింపులు నిలిచిపోయాయి.

ఇబ్బందిగా ఉంది..: రాష్ట్ర విభజన అనంతరం పశుసంవర్ధక శాఖకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు 9, 10 షెడ్యూలులో ఉన్నాయి. ఇందులో మన రాష్ట్రానికి చెందిన బడ్జెట్ రూ. 105 కోట్లు మేరకు నిధులు స్తంభించాయి. ప్రభుత్వ చర్చలలో ఉన్నాయి. బీమా పథకం ప్రతిపాదనలలో ఉంది. ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేస్తే పథకం అమలు చేయగలం. **-వేంకటేశ్వరరావు, జిల్లా సంచాలకులు, పశుసంవర్ధక శాఖ**

ప్రతి ఒక్కరికీ ఆటలు ఎంతో అవసరం

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరికీ ఆటలు ఎంతో అవసరమని ఏలూరు ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) అన్నారు. గత మూడు రోజులుగా భీమవరం కాస్మో పాలిటన్ క్లబ్‌లో జరుగుతున్న సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ టోర్నీ బుధవారంతో ముగిసింది. సాయంత్రం జరిగిన ముగింపు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను బాగా ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. భారత బ్యాడ్మింటన్ అసోషియేషన్ (ఈవెంట్స్) కార్యదర్శి కేసీహెచ్ పున్నయ్యచౌదరి మాట్లాడుతూ 2020 ఒలింపిక్స్‌లో మన దేశం క్రీడాకారులు రెండు బంగారు పతకాలు సాధించాలనే లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రానున్న రెండేళ్లలోనే దేశంలోనే ఏపీ బ్యాడ్మింటన్‌లో ప్రథమస్థానంలో నిలుస్తుందని పేర్కొన్నారు. దేశంలో గత 30 ఏళ్లుగా క్రమం తప్పకుండా టోర్నీలు నిర్వహిస్తున్న ఘనత భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌కే దక్కుతుందన్నారు. ఉండి శాసనసభ్యుడు వేటుకూరి శివరామరాజు మాట్లాడుతూ పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లోను క్రీడలు అభివృద్ధి చెందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అన్నారు. భారత బ్యాడ్మింటన్ అసోషియేషన్ సంయుక్త కార్యదర్శి అంకమ్మ చౌదరి, జిల్లా బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షుడు చిట్టూరి సుబ్బారావు, కార్యదర్శి సోమరాజు, కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు రామరాజు, తటవర్తి కృష్ణబాబు, గౌరవాధ్యక్షుడు ఉద్దరాజు కృష్ణప్రసాద్ తదితరులు మాట్లాడారు. అనంతరం పున్నయ్యచౌదరిని సన్మానించారు. విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

ఇంటర్ 'పిటీ'!



రిజర్వేషన్ బోగీలో ఛైర్‌కార్ సదుపాయం ఇంతే

(మొదటిపేజీ తరువాయి) ఎంత నష్టం? ఎంత కష్టం? తూర్పుతీర రైల్వే పరిధిలో ఓ రైలు పరిస్థితి ప్రస్తుతం ఇలాగే ఉంది. ఎక్స్‌ప్రెస్‌ను కాస్తా సూపర్ ఫాస్ట్‌గా మార్చారు. వాస్తవానికి పరిశీలిస్తే.. పేరు, టికెట్టు ధర మారాయి తప్ప.. వేగం పెరగలేదు. సౌకర్యాలు అదనంగా కల్పించలేదు. దీంతో ప్రయాణికులు నిలువుదోపిడీకి గురవుతున్నారు.

తూర్పుతీర రైల్వే పరిధిలో 18411 నెంబరు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉండేది. రైల్వే శాఖ గత ఏడాది జులై 10 నుంచి నుంచి ఎక్స్‌ప్రెస్‌గా ఉన్న ఇంటర్‌సిటీ రైలును 22819 నెంబరుతో సూపర్‌ఫాస్ట్ రైలుగా మార్పు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రయాణికులు ఎంతో సంబరపడ్డారు. ఎక్స్‌ప్రెస్ నుంచి సూపర్‌ఫాస్ట్‌గా మారటంతో గమ్యానికి చేరుకునేందుకు తక్కువ సమయం పట్టడంతో పాటు సదుపాయాలు పెరుగుతాయని అంతా ఎదురుచూశారు. కానీ, ఏడాది దాటుతున్నా సదుపాయాలేమీ పెరగలేదు. టిక్కెట్ ధరలు మాత్రమే పెరిగిపోయాయి.

సరిపోని బోగీలు

ఈ ఇంటర్‌సిటీని భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వరకు 22819 నెంబరుతో, విశాఖపట్నం నుంచి భువనేశ్వర్ వరకు 22820 నెంబరుతో సూపర్‌ఫాస్ట్ రైలుగా నడిపిస్తున్నారు. సూపర్‌ఫాస్ట్ రైలుగా మారిన తర్వాత రైలు వేగంలో, సదుపాయాల్లో ఒక్క మార్పు కూడా రాలేదు. సూపర్‌ఫాస్ట్ రైలులో ఆధునిక సదుపాయాలతో పాటు అదనంగా కోచ్‌లు ఏర్పాటు చేయాలి. అదేమీ చేయలేదు. గతంలో సాధారణ బోగీలతో పాటు డీ1, డీ2 పేరిట ఛైర్‌కార్ సీట్లతో రిజర్వేషన్ బోగీలు ఉండేది. సూపర్‌ఫాస్ట్‌గా మారిన తర్వాత డీ1 పేరిట ఒకే ఒక బోగీ కొనసాగిస్తున్నారు. హావడా నుంచి చెన్నై వెళ్లే సూపర్ ఫాస్ట్ రైలుకు సుమారు 24 కోచ్‌లు ఉండగా భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఈ ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ రైలుకు మాత్రం 6 జనరల్ బోగీలు, ఒక రిజర్వేషన్ ఛైర్‌కార్, ఒక ఎస్ఎల్ఆర్‌డీ (వికలాంగుల కోసం), ఒక ఎస్ఎల్ఆర్ (మహిళల కోసం) మాత్రమే ఉన్నాయి. దీంతో ప్రయాణికులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు.


ధరలే పెరిగాయి.. వేగం పెరగలేదు..

ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును సూపర్‌ఫాస్ట్‌గా మార్చేయటంతో టికెట్ల ధరలు సైతం పెరిగిపోయాయి. గతంలో పలాస నుంచి విశాఖపట్నం వరకు ఎక్స్‌ప్రెస్ టికెట్టు ధర రూ. 75 ఉండగా, సూపర్‌ఫాస్ట్‌గా మారిన తర్వాత రూ. 90కు పెంచేశారు. ఛైర్‌కార్ సీటు ధర గతంలో రూ. 90 ఉండగా, దాన్ని రూ. 105కు పెంచేశారు. ఒక్కో టికెట్టుపై రూ. 15 వరకు పెంచేయటంతో ప్రయాణికులపై రూ. కోట్ల భారం పడుతోంది. సూపర్ ఫాస్ట్ రైలుగా మారిన తర్వాత 14 కోచ్‌లతో నడపాల్సి ఉన్నా రైల్వే అధికారులు మాత్రం ఉన్నవాటితోనే సరిపుచ్చేస్తున్నారు. సూపర్‌ఫాస్ట్‌గా మారినా కూడా ఇటు భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వరకు, అటు విశాఖపట్నం నుంచి భువనేశ్వర్ వరకు ఇరువైపులా హాల్టులను యథావిధిగానే ఉంచేశారు. ఎక్స్‌ప్రెస్ నుంచి సూపర్‌ఫాస్ట్‌కు స్థాయి పెంచినా రైలు వేగం సైతం పెంచలేదు. పాత కాల పట్టిక ప్రకారమే నడుస్తుండటంతో పేరుకే సూపర్ ఫాస్ట్ రైలు తప్ప ఎక్స్‌ప్రెస్ రైలే నడిపించేస్తున్నారన్న భావన ప్రయాణికుల్లో ఉంది.

సిరుల నేల బంగారు బీల

● లక్ష్యాన్ని మించి వరి నాట్లు ● ఆనందంలో అన్నదాతలు

కవిటిగ్రామీణం : సిరులు కురిపించే నేల... ఉబికి పొంగే బోర్లు... నిరంతరం చిత్తడితో అన్నదాత కలల భూమి బంగారు బీల... కవిటి మండలంలో బీల ప్రాంతంలో 2,933 ఎకరాల్లో వరి పంట సాగుచేస్తున్నారు. ఖరీఫ్‌కు ఎన్నడూ లేనివిధంగా వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో లక్ష్యాలకు మించి ముందస్తు నాట్లు వేసి సాగుచేస్తున్నారు. ప్రస్తుతం వరుసగా వర్షాలు కురుస్తుండడంతో నెలవంక నుంచి మాణిక్యపురం వరకు 10 పంచాయతీలలో రైతులంతా వరినాట్లు పూర్తిచేశారు. పుటియాదళ ప్రాంతంలో రైతులు నారుమడి దశలో ఉండగానే వరద ముంపునకు గురవడంతో ఇబ్బందులు ఎదురైనా ప్రతికూల పరిస్థితులను సైతం ఎదుర్కొని పొలాల్లో నాట్లు వేయడం పూర్తిచేశారు. సకాలంలో పడిన వర్షాలు అన్నదాతలకు అనుకూలించినా తాజా వర్షాలు పుటియాదళ, మాణిక్యపురం, బల్లిపుట్టుగ ప్రాంత రైతులను కాస్త కలవరపెడుతున్నాయి. చాలాచోట్ల పొలాలు ముంపునకు గురవుతుండడమే వీరి కలవరానికి కారణం. కాగా కవిటి పరిధిలో రైతులంతా పంట పొలాల్లో కలుపునివారణ చర్యలు చేపడుతూ ఎరువులను చల్లడంలో తలమునకలై ఉన్నారు.



బీల ప్రాంతంలో పచ్చగా కనిపిస్తున్న వరి పంట

బోరు నుంచి ఉబికివస్తున్న నీరు

రైతులకు రాయితీపై విత్తనాలు

ఈసారి ఖరీఫ్‌లో వ్యవసాయశాఖ సకాలంలో విత్తనాల సరాఫరా చేయడంలో సఫలీకృతమయ్యారు. ప్రధానంగా బీల ప్రాంతానికి అవసరమైన శ్రీకాకుళం సన్నాలు, సాంబమసూరి, స్వర్ణ, ఆర్జీఎల్ వంటి విత్తనరకాలు రాయితీపై సరఫరా చేశారు. భూసారపరీక్షల ఫలితాల మేర జింక్ లోపం గుర్తించిన 1200 ఎకరాల్లో 240 క్వింటాళ్ల జింక్‌ను వ్యవసాయశాఖ నూరుశాతం రాయితీపై సరఫరా చేశారు. ఎరువుల యాజమాన్యం, తెగుళ్ల తాకిడి వంటి అంశాలపై వ్యవసాయాధికారులు రైతులకు చైతన్యం చేస్తూ క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. సాధారణ దిగుబడి ఎకరాకు 25 బస్తాలు కాస్తా ఈ ఏడాది మరింత పెరగగలదని అన్నదాతలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బీల ప్రాంతలో వరి పంట ఆశాజనకంగా ఉంది. యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల దిగుబడులు పెరిగే అవకాశాలున్నాయి. ప్రధానంగా ఎరువుల వాడకంలో రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టిసారించాలి. ఫలితంగా చీడపీడల బారి నుంచి తప్పించుకోవచ్చు. తెగుళ్ల ప్రాథమిక దశలో నివారణ చర్యలు ఉత్తమం. తాజా వర్షాలకు సాధ్యమైన మేరకు పంట పొలాల్లో నీరు మళ్లింపు చర్యలు చేపట్టాలి. ఈమేరకు క్షేత్రస్థాయిలో పర్యటన చేసి రైతులకు సూచనలు చేస్తున్నాం.

– బి.నరసింహమూర్తి, మండల వ్యవసాయాధికారి, కవిటి

అందరి అంగీకారంతోనే పరిహారం పంపిణీ



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి కె.శ్యామలాదేవి

పాలకొండ, న్యూస్‌టుడే: నిర్వాసితుల అందరి అంగీకారంతోనే పరిహారం పంపిణీ చేస్తామని, ఎవరినీ బలవంతంగా తీసుకోమని చెప్పమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి కె. శ్యామలాదేవి పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ప్రత్యేకంగా నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోసమే అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌కు హాజరుకాని నిర్వాసితులు వచ్చే నెల 9న నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్‌కు హాజరై సమస్యలు పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా 97 కేసుల్లో రూ.3,99,75,655 మొత్తాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రెడ్డి గున్నయ్య, భూసేకరణ ప్రత్యేక విభాగం డిప్యూటీ కలెక్టర్‌లు డి.గోవర్ధనరావు, జె.సీతారాములు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సురేష్‌లు పాల్గొన్నారు.

ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎస్పీ త్రివిక్రమవర్మ

అరసవల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని ఎస్పీ త్రివిక్రమవర్మ ఆదేశించారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ త్రివిక్రమవర్మ మాట్లాడుతూ సైబర్ నేరాలపై సీఐలు, ఎస్ఐలు ప్రజలకు అవగాహన కల్పించి ఏటీఎంల వినియోగంపై, తప్పుడు ఫోన్ కాల్స్‌పై సూచనలు చేయాలని చెప్పారు. రాంగ్ కాల్స్‌పై స్పందించకుండా, ఏటీఎం పిన్ నెంబరు ఇతరులకు ఇవ్వకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొనే వ్యవస్థను వేగవంతం చేయాలని వివరించారు. నేరాలను అదుపు చేసేందుకు ఇది దోహదపడుతుందని వెల్లడించారు. జిల్లాలో కోటబొమ్మాళి, రాజాం, కవిటి, ఎచ్చెర్ల, జె.ఆర్.పురం, శ్రీకాకుళం గ్రామీణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో రోడ్డుప్రమాదాలు తగ్గించాలని సూచించారు. విధులలో అలసత్వం ప్రదర్శిస్తే క్షమించేది లేదన్నారు. బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరుల ప్రార్థనలకు ఆటంకం లేకుండా చూడాలని ఆదేశించారు. పోలీసు విధులలో సీపీవోలు చేరారో లేదో పర్యవేక్షించాలని కోరారు. బ్లూకోట్స్ వాహనాలు గల్లీల్లో తిరగాలని, జీపీఎస్ సిస్టం ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యామలాదేవి మాట్లాడుతూ రానున్న లోక్‌అదాలత్‌లో కనీసం 800 కేసులైనా రాజీ చేసే ప్రయత్నం చేయాలని అన్నారు. కేసులకు సంబంధించిన న్యాయ సలహాలు, సూచనలు చేశారు. టెక్కలి, భోరుభద్ర, రాజాం, వంగర, పలాస, పూండి ప్రాంతాలలో బస్సులు చాలక విద్యార్థులు ఫుట్‌బోర్డుపై ప్రయాణాలు చేస్తున్నారని.. దీనిపై స్పందించాలని ఆర్టీసీ డిపో మేనేజర్లను ఆదేశించారు. ఎక్సైజ్ డి.సి. శివప్రసాదు మాట్లాడుతూ మద్యం గొలుసు దుకాణాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. కాగా, హోంగార్డు విధులు నిర్వహిస్తూ మే 30న ఉద్యోగ విరమణ పొందిన పి.మహేంద్రబాబుకు తోటి సహోద్యోగుల ఒకరోజు వేతనం వితరణ రూ. 2.38 లక్షలను చెక్కు రూపంలో ఎస్పీ చేతులమీదుగా అందజేశారు. సమావేశంలో ఏఎస్పీ షేక్ షీరీన్ బేగం, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జిల్లా సైనిక సంక్షేమ అధికారుల సమావేశం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ సంచాలకుడు కమెడోర్ ఎంవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో రాష్ట్రంలోని పలు జిల్లాల సైనిక సంక్షేమ అధికారుల సమావేశం నిర్వహించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారులంతా తమ తమ జిల్లాకు సంబంధించిన మాజీ సైనికులు, వారి వితంతువుల వివరాలు, వారి కార్యాలయాల ద్వారా వారికి అందజేస్తున్న సహాయ సహకారాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో కమెడోర్ ఎవీఎస్‌కుమార్ మాజీ సైనికులు, వారి వితంతువులకు ప్రస్తుతం అమలులో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సదుపాయాలు, వాటి అమలు తీరు పూర్తి స్థాయిలో సమీక్షించారు. ప్రత్యేక నిధి(స్పెషల్ ఫండ్) నుంచి మాజీ సైనికులు, వారి వితంతువులకు అందించే రాయితీలకు సంబంధించి కొంత వెసులుబాటు కల్పించి త్వరితగతిన అందించేందుకు తగు సూచనలు చేశారు. సమావేశంలో సహాయ సంచాలకురాలు టి.స్వర్ణకుమారి, పలు జిల్లాల సైనిక సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

కోర్సులను సద్వినియోగం చేసుకోండి

బలగ (శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదాన సమీపాన ఉన్న గిరిజన యువత శిక్షణ కేంద్రంలో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని టాటా స్ట్రైవ్ రీజినల్ మేనేజర్ టి.మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆటో మొబైల్ టెక్నీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వీటికి ప్రాథమిక విద్యార్హత పదో తరగతి అని ఆయన పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న గిరిజన విద్యార్థులు మరిన్ని వివరాలకు వైటీసీని సంప్రదించాలని ఆయన సూచించారు.